RNI Regd. No. TELTEL/2023/86207

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in


మేడ్చల్ మల్కాజ్గిరి | సంపుటి : 2 సంచిక : 60 | ఆదివారం, మార్చి 31, 2024 | పేజీలు : 4

## లోక్‌సభ ఎన్నికల బిజెపి మేనిఫెస్టో కమిటీకి రాజ్‌నాథ్ సింగ్ నేతృత్వం

న్యూఢిల్లీ: లోక్‌సభ ఎన్నికల కోసం ఏర్పాటు చేసే బిజెపి 27 మంది సభ్యుల మేనిఫెస్టో కమిటీకి రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ నేతృత్వం వహిస్తారు, పార్టీ తన ఎన్నికల వాగ్దానాల కోసం దేశవ్యాప్తంగా ప్రజల నుండి సలహాలను కోరుతోంది. ఈ కమిటీకి కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ కన్వీనర్‌గా, మరో కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ కో-కన్వీనర్‌గా వ్యవహరిస్తారు. గుజరాత్, అస్సాం, మధ్యప్రదేశ్ వంటి రాష్ట్రాల ముఖ్యమంత్రులతో పాటు పలువురు కేంద్ర మంత్రులు, శివరాజ్ సింగ్ చౌహాన్, వసుంధర రాజే వంటి అనుభవజ్ఞులు కమిటీలో సభ్యులుగా ఉన్నారు.

### రేవంత్ రెడ్డి ఇంటి ముందు కాంగ్రెస్ నేత

## ఆత్మహత్యాయత్నం..!



హైదరాబాద్ : తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హైదరాబాద్ నివాసం వద్ద ఓ వ్యక్తి ఆత్మహత్యాయత్నానికి పాల్పడటం కలకలం రేపింది. అతను ఒంటిపై డీజిల్ పోసుకొని ఆత్మహత్యకు ప్రయత్నించాడు. ముఖ్యమంత్రి తనకు అపాయింట్‌మెంట్ ఇవ్వడం లేదని అతను ఈ చర్యకు పాల్పడ్డాడు. పోలీసులు అతనిని అడ్డుకొని అదుపులోకి తీసుకున్నారు. కాంగ్రెస్ పార్టీలోకి కొత్తగా వచ్చిన వారందరికీ ప్రాధాన్యం ఇస్తున్నారు.. తన లాంటి కాంగ్రెస్ కార్యకర్తలకు పార్టీలో ప్రాధాన్యత ఇవ్వడం లేదు. అందుకే ఆత్మహత్యాయత్నం చేసినట్లు భూపాలపల్లికి చెందిన కాంగ్రెస్ నేత కృష్ణ సాగర్ పేర్కొన్నారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

## బిఆర్ఎస్‌కు మరో షాక్....

### చేజారిన కామారెడ్డి మున్సిపాలిటీ

కామారెడ్డి: తెలంగాణలో బిఆర్ఎస్‌కు వరుసగా ఎదురు దెబ్బలు తగులుతున్నాయి. కీలక నేతలు బిఆర్ఎస్ పార్టీని వదిలిపెడుతున్న తరుణంలో కామారెడ్డిలో మున్సిపాలిటీ బిఆర్ఎస్ చేజారిపోయింది. కామారెడ్డి బిఆర్ఎస్ మున్సిపల్ చైర్ పర్సన్ నిట్టు జాహ్నవిపై పెట్టిన అవిశ్వాసం నెగ్గింది. దీంతో ఆమె చైర్మన్ పదవిని కోల్పోయారు. కొత్త మున్సిపల్ చైర్ పర్సన్‌గా కాంగ్రెస్ కౌన్సిలర్ గడ్డం ఇందుప్రియ ఎన్నికయ్యారు. బిఆర్ఎస్ పార్టీకి చెందిన జాహ్నవిపై సొంత పార్టీ కౌన్సిలర్లే తిరుగుబాటు చేశారు. 9 మంది బిఆర్ఎస్ కౌన్సిలర్లు కాంగ్రెస్ పార్టీకి సహకరించారు. 49 మంది కౌన్సిలర్లకు గాను 27 మంది అవిశ్వాసానికి మద్దతుగా నిలిచారు. ఇందులో 9 మంది బిఆర్ఎస్ కౌన్సిలర్లు. వారు వెళ్లిపోగా బిఆర్ఎస్‌కు 16 మంది ఉన్నారు. బిజెపికి చెందిన ఆరుగురు కౌన్సిలర్లు అవిశ్వాసానికి హాజరు కాలేదు. అవిశ్వాసానికి మద్దతుగా చేతులు లేపిన బిఆర్ఎస్ ప్రజాప్రతినిధులు



త్వరలో కాంగ్రెస్ పార్టీలో చేరనున్నారని తెలుస్తోంది. కొత్త మున్సిపల్ చైర్ పర్సన్‌గా ఎన్నికైన ఇందుప్రియ కామారెడ్డి 8వ వార్డు కౌన్సిలర్‌గా ఉన్నారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఆమె బిఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరారు.

## జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించాలి: సీఎం రేవంతు టీడబ్ల్యూజేఎఫ్ విజ్ఞప్తి

**హైదరాబాద్ స్టేట్ బ్యూరో, మార్చి 30:** రాష్ట్రంలోని జర్నలిస్టులు దీర్ఘకాలికంగా ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్(టీడబ్ల్యూజేఎఫ్) రాష్ట్ర కమిటీ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్రెడ్డికి విజ్ఞప్తి చేసింది. ఈమేరకు శనివారం హైదరాబాద్ లోని సచివాలయంలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డితో కలిసి ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు మామిడి సోమయ్య, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.బసవపున్నయ్య, కార్యదర్శులు ఎస్కె. సలీమ, బి. జగదీశ్వర్, ఈ చంద్రశేఖర్ తదితరులు సీఎంను కలిశారు ఈ సందర్భంగా జర్నలిస్టుల సమస్యలతో కూడిన వినతిపత్రం సమర్పించారు. జర్నలిస్టుల ఇండ్లస్థలాల సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు. అన్ని కార్పొరేట్, ప్రయివేటు ఆస్పత్రుల్లో పనిచేసేలా కొత్త హెల్త్ కార్డుల విధానం తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు. అక్రిడిటేషన్ కార్డులను చూపిస్తే సచివాలయంలోకి అనుమతించేలా ఆదేశాలు ఇవ్వాలని కోరారు. తెలంగాణ మీడియా అకాడమీలో అన్ని పత్రికల సంపాదకులను నియమించాలనీ, అలాగే జీవో 239 ద్వారా ప్రభుత్వ గుర్తింపు పొందిన అన్ని యూనియన్లను మీడియా అకాడమీ సభ్యత్వం కల్పించాలని సీఎం దృష్టికి తీసుకెళ్లారు. మహిళా జర్నలిస్టులు, చిన్న, మధ్య తరహా పత్రికల సమస్యలను పరిష్కారించాలని సూచించారు ఇందుకు స్పందించిన సీఎం రేవంత్రెడ్డి మాట్లాడుతూ ఎన్నికల తర్వాత జర్నలిస్టుల సమస్యలపై దృష్టిపెట్టి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.



## నాకూ ఐటి నోటీసులు వచ్చాయి

### - డికె శివ కుమార్



బెంగళూరు: తన పార్టీకి జారీ చేసినట్లుగానే ఇదివరకే పరిష్కారమైన వ్యవహారంలో తనకు కూడా ఆదాయం పన్ను(ఐటి) శాఖ నుంచి నోటీసు జారీ అయిందని కర్నాటక ఉప ముఖ్యమంత్రి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు డికె శివకుమార్ శనివారం వెల్లడించారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఆదేశాల మేరకు ఐటి అధికారులు చర్యలు తీసుకుంటున్నారని విలేకరులతో మాట్లాడుతూ ఆయన ఆరోపించారు. ప్రతిపక్షాలనే లక్ష్యంగా చేసుకుని బిజెపి ఈ చర్యలకు పాల్పడుతోందని, దీన్ని బట్టి చూస్తే కాంగ్రెస్‌కు, ఇండియా కూటమికి బిజెపి భయపడుతోందని అర్థమవుతోందని డికె వ్యాఖ్యానించారు. ఐటి నోటీసులతో ప్రతిపక్షాలను భయపెట్టాలని బిజెపి చూస్తోందని, ఎన్నికల్లో ఓడిపోతామని వారికి అర్థమైందని ఆయన విమర్శించారు. కాంగ్రెస్ పార్టీకి శుక్రవారం ఐటి శాఖ నుంచి రూ. 1,823.08 కోట్ల చెల్లింపులకు సంబంధించి ఐటి శాఖ నోటీసులు జారీచేసింది. దీనిపై స్పందించిన కాంగ్రెస్ నాయకులు జైరాం రమేష్, అజయ్ మాకెన్ లోక్‌సభ ఎన్నికల ముందు ప్రతిపక్షాలను ఆర్థికంగ దెబ్బతీసే పన్ను ఉగ్రవాదానికి బిజెపి పాల్పడుతోందని వారు ఆరోపించారు.

### న్యాయ వ్యవస్థపై...

## కేంద్రం ఒత్తిడి

న్యూఢిల్లీ: ఎన్నికల బాండ్ల పథకాన్ని సుప్రీం కోర్టు రద్దు చేసిన తర్వాత న్యాయ వ్యవస్థపై కేంద్ర ప్రభుత్వం ఒత్తిడి పెడుతోందని కాంగ్రెస్ నాయకురాలు ప్రియాంక గాంధీ వాద్రా ఆరోపించారు. స్వతంత్ర, బలమైన న్యాయ వ్యవస్థను కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం ఆమోదిస్తుందా అని ఆమె సందేహం వ్యక్తం చేశారు. న్యాయ వ్యవస్థపై ఒత్తిడి తీసుకువచ్చి న్యాయస్థానాలను అప్రతిష్ట పాల్జేసేందుకు కొన్ని స్వార్థ శక్తులు ప్రయత్నిస్తున్నాయని ఆరోపిస్తూ 600 మందికి పైగా న్యాయవాదులు ఇటీల సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తికి లేఖ రాయడంపై ప్రధాని స్పందిస్తూ కాంగ్రెస్ పార్టీని తీవ్రంగా విమర్శించిన నేపథ్యంలో ప్రియాంక గాంధీ శనివారం స్పందించారు. ఎన్నికల బాండ్లపై(ప్రజలు దీన్ని బెదిరింపు వసూళ్ల కుంభకోణం అని అంటున్నారు) సుప్రీంకోర్టు నిర్ణయం తీసుకున్న అనంతరం న్యాయ వ్యవస్థపై ఒత్తిడి తెచ్చే విధంగా లేఖలు రాయించిన తీరు, ప్రధాని నేరుగా తాను ఈ వ్యవహారంలో చొరబడి న్యాయ వ్యవస్థకు వ్యతిరేకంగా వ్యాఖ్యలు చేయడం చూస్తే ఇందులో ఏదో మతలబు ఉందని అర్థమవుతోందని ఎక్స్ వేదికగా ప్రియాంక గాంధీ వ్యాఖ్యానించారు.



### అప్పుడు జార్ఖండ్‌లో జరిగిందే...

## ఇప్పుడు ఢిల్లీలో జరుగుతోంది

### - కల్పనా సోరెన్

న్యూఢిల్లీ: నరేంద్రమోదీ సర్కారు కేంద్ర దర్యాప్తు సంస్థలను వినియోగిస్తున్న తీరుపై జార్ఖండ్ మాజీ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ భార్య కల్పనా సోరెన్ మండిపడ్డారు. అప్పుడు హేమంత్ సోరెన్‌ను అరెస్ట్ చేసి జైల్లో పెట్టిన విషయాన్ని, ఇప్పుడు అరవింద్ కేజ్రీవాల్‌ను అరెస్ట్ చేసి జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించిన విషయాన్ని ప్రస్తావిస్తూ.. 'రెండు నెలల క్రితం జార్ఖండ్‌లో ఏదైతే జరిగిందో.. ప్రస్తుతం ఢిల్లీలో అదే జరుగుతోందని విమర్శించారు. అప్పుడు తన భర్తను జైలుకు పంపినట్టే ఇప్పుడు కేజ్రీవాల్‌ను జైలుకు పంపారని కల్పనా సోరెన్ అన్నారు. ఇవాళ మధ్యాహ్నం ఢిల్లీలో కేజ్రీవాల్ భార్య సునీతా కేజ్రీవాల్‌ను కలిసి బయటికి వచ్చిన అనంతరం కల్పనా సోరెన్ మీడియాతో మా



ట్లాడారు. కేంద్రం తీరుకు వ్యతిరేకంగా పోరాటం చేయాలని తాము నిర్ణయించు కున్నామని చెప్పారు. ఇప్పుడు తాను కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ చైర్మన్ సోనియాగాంధీని కలువబోతున్నానని, జార్ఖండ్‌లో ప్రస్తుత పరిస్థితిపై ఆమెతో చర్చిస్తానని కల్పనా సోరెన్ తెలిపారు. అదేవిధంగా రేపు ఢిల్లీలోని రామ్‌లీలా మైదాన్‌లో ఇండియా కూటమి నిర్వహిస్తున్న బహిరంగ సభలో తాను కూడా పాల్గొంటానని చెప్పారు.

### భారత రత్నలు ప్రదానం చేసిన

## రాష్ట్రపతి ముర్ము



న్యూఢిల్లీ: మరణానంతరం దేశ అత్యున్నత పురస్కారం భారత రత్నకు ఎంపికైన మాజీ ప్రధాన మంత్రులు పివి నరసింహారావు, చౌదరి చరణ్ సింగ్, వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ ఎంఎస్ స్వామినాథన్, బీహార్ మాజీ ముఖ్యమంత్రి కర్పూరీ ఠాకూర్ తరఫున వారి వారసులు శనివారం రాష్ట్రపతి భవన్‌లో జరిగిన ఒక కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా పురస్కారాలను అందుకున్నారు. మాజీ ప్రధాని పివి నరసింహారావు కుమారుడు పివి ప్రభాకర్ రావు తన తండ్రి తరఫున అవార్డును రాష్ట్రపతి ద్రౌపది ముర్ము నుంచి స్వీకరించారు.

చరణ్ సింగ్ మనవడు, రాష్ట్రీయ లోక్ దళ్(ఆర్ఎల్‌డి) అధ్యక్షుడు జయంత్ చౌదరి అవార్డును అందుకున్నారు. ఎంఎస్ స్వామినాథన్ తరఫున ఆయన కుమార్తె నిత్యా రావు, కర్పూరీ ఠాకూర్ కుమారుడు రాంనాథ్ ఠాకూర్ రాష్ట్రపతి చేతుల మీదుగా అవార్డులను అందుకున్నారు. ఈ అవార్డుల ప్రదానోత్సవంలో రాష్ట్రపతితోపాటు ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖర్, ప్రధాని నరేంద్ర మోడీ, ఇతర ప్రముఖులు పాల్గొన్నారు. భారతీయ జనతా పార్టీ కురువృద్ధ నాయకుడు, మాజీ ఉప ప్రధాని ఎల్‌కె అద్వానీతోనహా ఐదుగురికి కేంద్ర ప్రభుత్వం ఈ ఏడాది భారత రత్న అవార్డులను ప్రకటించింది.

కాగా.. మాజీ ప్రధాన మంత్రులు పివి నరసింహారావు, చౌదరి చరణ్ సింగ్‌లతోపాటు స్వామి నాథన్, కర్పూరీ ఠాకూర్ దేశానికి అందచేసిన సేవలను శ్లాఘించిన ప్రధాని నరేంద్ర మోడీ భారత రత్న అవార్డులకు ఎంపిక వారికి ఘన నివాళు లర్పించారు. మాజీ ప్రధాని పివి నరసింహారావు దేశానికి చేసిన సేవలను ప్రతి భారతీయుడు స్మరించుకుంటారని మోడీ అన్నారు. ఆయనకు భారత రత్న రావడం ప్రతి భారతీయుడికి గర్వకారణమని మోడీ తెలిపారు.

### కాంగ్రెస్ కండువా కప్పుకోనున్న...

## నందమూరి సుహాసిని



హైదరాబాద్: తెలంగాణ కాంగ్రెస్‌లో చేరికలు ఎలా ఉన్నాయో ప్రత్యేకించి చెప్పక్కర్లేదు. అటు కారు దిగడం.. ఇటు కాషాయ పార్టీకి గుడ్ బై చెప్పేసి ఒక్కొక్కరుగా హస్తం గూటికి చేరిపోతున్నారు. సిట్టింగ్ ఎంపీలు, ఎమ్మెల్యేలు.. ఎంపీ అభ్యర్థులుగా ప్రకటన తర్వాత కూడా కాంగ్రెస్‌లో చేరిపోతుండటం గమనార్హం. శనివారం ఒక్కరోజే జీహెచ్ఎంసీ మేయర్ గద్వాల విజయలక్ష్మి, మాజీ ఎమ్మెల్సీ పురాణం సతీష్‌తో పాటు పలువురు ముఖ్యనేతలు బీఆర్ఎస్‌కు బై బై చెప్పేసి కాంగ్రెస్ కండువాలు కప్పుకున్నారు. మరోవైపు హైదరాబాద్‌కు చెందిన ఐదుగురు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు సైతం హస్తం గూటికి రావడానికి ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలియవచ్చింది. ఇదే క్రమంలో నందమూరి సుహాసిని కూడా కాంగ్రెస్‌లో చేరడానికి సన్నాహాలు చేస్తున్నట్లు తెలిసింది.

## సంపాదకీయం

# లద్దాఖ్ బతుకుపోరు

లద్దాఖ్ ప్రాంతానికి రాష్ట్రహోదా కల్పించడం, దానిని రాజ్యాంగంలోని ఆరవషెడ్యూల్‌లో చేర్చడం ఇత్యాది డిమాండ్లతో ఇరవై ఒక్కరోజుల నిరాహారదీక్షకు దిగిన ప్రముఖ పర్యావరణ ఉద్యమకారుడు సోనమ్. లద్దాఖ్ ప్రాంతానికి రాష్ట్రహోదా కల్పించడం, దానిని రాజ్యాంగంలోని ఆరవషెడ్యూల్‌లో చేర్చడం ఇత్యాది డిమాండ్లతో ఇరవై ఒక్కరోజుల నిరాహారదీక్షకు దిగిన ప్రముఖ పర్యావరణ ఉద్యమకారుడు సోనమ్ వాంగ్‌చుక్ మంగళవారం తన దీక్ష ముగించారు. మార్చి 6నుంచి అత్యంత కఠినమైన వాతావరణంలో కొనసాగిన ఆయన దీక్షకు దేశవ్యాప్తంగా మద్దతు లభించింది. దీక్షవిరమణ రోజున సినీనటుడు ప్రకాష్ రాజ్ తన పుట్టినరోజును దీక్షాస్థలిలోనే జరుపుకొని లద్దాఖ్ ప్రజల ఉద్యమానికి తన సంఘీభావం ప్రకటించారు. తాను దీక్షవిరమించినప్పటికీ లద్దాఖ్ ప్రజల హక్కుల కోసం సాగుతున్న ఈ పోరాటం ఆగదని ప్రకటించిన సోనమ్, ఒక వీడియోలో ప్రధాని, హోంమంత్రిని ఉద్దేశించి కొన్ని వ్యాఖ్యలు చేశారు. మైనస్ పదిడిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలో తనతోపాటు 350మంది దీక్షలో కూచుంటే పాలకులు ఏ మాత్రం స్పందించపోవడంమీద ఆశ్చర్యం వ్యక్తంచేశారు. మోదీ, అమిత్‌షాలు రాజకీయనాయకుల్లాగా కాక, రాజనీతిజ్ఞుల్లాగా వ్యవహరించాలని తామంతా కోరుకుంటున్నామని, అందుకు వారిద్దరూ కాస్తంత ఔన్నత్యాన్ని, దూరదృష్టిని ప్రదర్శించాలని వ్యాఖ్యానించాడు. ఆయన దీక్ష ముగిసినప్పటికీ, ఇప్పుడు లద్దాఖ్‌లోని మహిళాసంఘాలు అవే డిమాండ్లతో నిరాహారదీక్ష ఆరంభించాయి. లద్దాఖ్ ప్రజల డిమాండ్ల మీద నెలలక్రితమే ఒక ఉన్నతస్థాయి కమిటీని నియమించి, ఉద్యమకారులతోనూ, ప్రతినిధులతోనూ పలుమార్లు చర్చోపచర్చలు సాగించింది కేంద్రప్రభుత్వం. మార్చి 4వతేదీన తనను కలిసిన లద్దాఖ్ నాయకులతో కేంద్ర హోంమంత్రి అమిత్ షా కఠినంగా మాట్లాడుతూ వారి డిమాండ్లకు ఏమాత్రం తలొగ్గేది లేదని తేల్చేయడంతో సోనమ్ వాంగ్‌చుక్ ఈ దీక్షకు పూనుకున్నట్టు వార్తలు వచ్చాయి. పర్యావరణ ఉద్యమకారుడు, సృజనాత్మక విద్యావేత్త, ఇంజనీర్ అయిన సోనమ్ జీవితం ఆధారంగానే హిందీచిత్రం 'త్రీ ఇడియట్స్' నిర్మితమైన విషయం తెలిసిందే. లద్దాఖ్ పర్యావరణం, గిరిజన సంస్కృతి పరిరక్షణల కోసం ఈ రామన్‌మెగసెసే అవార్డు గ్రహీత పడుతున్న ఆవేదనను కానీ, భూమి, ఉపాధి ఇత్యాది విషయాల్లో స్థానికుల భయాందోళనలను కానీ పాలకులు లెక్కచేయడం లేదు. జమ్మూకశ్మీర్ ప్రత్యేక ప్రతిపత్తిని రద్దుచేసి, ఆ రాష్ట్రాన్ని రెండు కేంద్రపాలిత ప్రాంతాలుగా కుదించిన ఏడాదిలోనే లద్దాఖ్‌వాసులకు తమకు జరిగిన, జరగబోతున్న అన్యాయం అర్థమైంది. లద్దాఖ్ ప్రధానంగా బౌద్ధమతాన్ని ఆచరించే వివిధ ఆదివాసీ తెగల ప్రాంతం. రాష్ట్రంగా లేకపోవడం, ప్రత్యేకరక్షణలు తొలగిపోవడంతో భూమిపై వస్తున్న సంప్రదాయహక్కులకు హామీలేకుండా పోయింది. డెబ్బయ్యేళ్ళలో ఎన్నడూ లేనంత అభద్రతలోకి వారు జారిపోయారు. తమ సర్వహక్కులను, రక్షణలను ఆర్టికల్ 370 మింగేసిన నేపథ్యంలో, వాటిని తిరిగి సాధించడానికి పోరాటం తప్పదని వారు గ్రహించారు. వివిధ ప్రజాసంఘాలతో కూడిన లేహ్ అపెక్స్ బాడీ నాలుగేళ్ళుగా లద్దాఖ్‌ను ఆరోషెడ్యూల్ కింద చేర్చాలని పోరాటం చేస్తున్నది. లద్దాఖ్‌తో బలవంతంగా కలిపిన కార్గిల్ ప్రాంతవాసులు తమను తిరిగి కశ్మీర్‌తో కలపమని మరోపక్క ఉద్యమిస్తున్నారు. లద్దాఖ్‌కు రాష్ట్రహోదా, రాజ్యాంగంలోని ఆరోషెడ్యూల్‌లో చేర్చడం ద్వారా ఆదివాసీ తెగల స్థానిక స్వయంపాలనకు అవకాశం, స్థానికులకే ఉద్యోగ, ఉపాధి అవకాశాలను రిజర్వుచేస్తూ ఒక పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఏర్పాటు ఇత్యాదివి వారి డిమాండ్లలో ప్రధానమైనవి. లద్దాఖ్ కేంద్రపాలిత ప్రాంతాన్ని ఆరోషెడ్యూల్‌లో చేర్చడం స్థానిక ప్రజల ప్రయోజనాల పరిరక్షణరీత్యా అవశ్యకమంటూ షెడ్యూల్ తెగల జాతీయ కమిషన్ నాలుగేళ్ళక్రితం కేంద్రప్రభుత్వానికి సిఫారసు చేసిందని అంటారు. అయితే, కేంద్రప్రభుత్వం స్థానిక ప్రజల ఉద్యమాలకు స్పందిస్తున్నట్టు కనిపిస్తూనే వారి డిమాండ్లకు ఏమాత్రం లొంగదల్చుకోలేదని అర్థమవుతోంది. తమ వనరులు ఇతరులు దోచుకుంటారన్న లద్దాఖ్‌వాసుల భయం కూడా క్రమంగా నిజమవుతోంది. బయటివ్యక్తులు వారి భూములను కొనుగోలు చేయడం, అభివృద్ధి పేరిట సాగే విధ్వంసం కూడా ఆరంభమైంది. అస్మదీయ కార్పొరేట్ సంస్థలకు వేలాది ఎకరాల భూమిని అప్పగించడం మొదలైంది. ఆరవషెడ్యూల్‌లో చేర్చినపక్షంలో ఈ భారీ భూ సంతర్పణలు, వనరుల అప్పగింత సులభం కాదు కనుక, కేంద్రప్రభుత్వం ఆ ఊసు ఎత్తడం లేదు. చైనా, పాకిస్థాన్‌లతో సరిహద్దులు పంచుకుంటున్న లద్దాఖ్ వ్యూహాత్మకంగా, భద్రతాపరంగా ఎంతో కీలకమైనది. కశ్మీర్ ఉగ్రవాదం పతాకస్థాయిలో ఉన్నప్పుడు కూడా అది లద్దాఖ్‌ను తాకలేదు. కార్గిల్ యుద్ధ సమయంలో లద్దాఖ్‌వాసులు భారతసైన్యానికి అందించిన సేవలు విలువకట్టలేనివి. గాల్వాన్ ఘటన, చైనా వరుస చొరబాట్లు లద్దాఖ్ విషయంలో మనం అతి జాగ్రత్తగా వ్యవహరించాల్సిన అవసరాన్ని గుర్తుచేస్తున్నాయి. గడ్డకట్టే చలిలో వేలాదిమంది చేస్తున్న ఆ ఉద్యమాన్ని నిర్లక్ష్యం చేయడం మంచిదికాదు.

# ప్రపంచ దేశాలకు అన్నం పెట్టే స్థాయికి మన వ్యవసాయరంగం ప్రగతి సాధించాలి: మంత్రి తుమ్మల నాగేశ్వరరావు






**శామీర్ పేట, (గరుడ వార్త):** ప్రపంచ దేశాలకు అన్నం పెట్టే స్థాయికి మనం వ్యవసాయ రంగంలో అభివృద్ధి చెందాలని తెలంగాణ రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు అన్నారు. శామీర్ పేట మండలం జినోమ్ వాలీ పరిధిలో ఏటిజిసీ బయోటెక్ అగ్రి ఇన్నోవేషన్ బ్లాక్ సి కోసం తెలంగాణ రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు ముఖ్య అతిధిగా విచ్చేసి భూమిపూజ చేసి శంకుస్థాపన చేశారు. మంత్రి ఏటీజీసీ బయోటెక్ సంస్థ సౌకర్యాలు, రీసెర్చ్ ల్యాబ్ లు, ప్రొడక్షన్ యూనిట్లను, ఇన్నోవేషన్ సెంటర్లను సందర్శించారు. అనంతరం ఏటీజీసీ బయో ఫౌండేషన్ యొక్క కొత్త బ్లాక్ –సి నిర్మాణానికి మంత్రి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ వ్యవసాయ దేశమైన మన భారతదేశంలో వ్యవసాయాన్ని కాపాడుకుని ప్రపంచ దేశాల్లో తినడానికి తిండి లేని రోజుల్లో అత్యధిక జనాభ కలిగిన మన దేశంలో వ్యవసాయం ఎంతగానో అభివృద్ధి చెందిందన్నారు. దేశాన్ని గడగడలాడించిన కరోనా సమయంలో అన్ని పనులు ఆగాయి గాని రైతుల పని ఏ మాత్రం ఆగలేదన్నారు. మన జాతి ఔనత్యానికి నిదర్శనం వ్యవసాయం అన్నారు. వ్యవసాయానికి సరికొత్త పరిజ్ఞానాన్ని ఏటీజీసీ సంస్థ అందిస్తూ, ఏటువంటి క్రిమి సంహారక పురుగు మందులు లేని, పంటలకు హాని చేయని ఉత్పాదనలను తయారు చేస్తున్నామని ప్రొఫెసర్ రాంచంద్రా రెడ్డి చెప్పడం చాలా సంతోషంగా ఉందన్నారు. మట్టితోనే మనకు వ్యసాయం నేర్పిన ఘనుడు పద్మశ్రీ అవార్డు గ్రహిత శ్రీ చింతల వెంకట్ రెడ్డి అని కొనియాడారు. 40 సంవత్సరాలుగా తాను కూడా వ్యవసాయం చేస్తున్నానని నేను చేసే వ్యవసాయంలో ఎలాంటి యూరియా వేయనని చెప్పారు. మంత్రి ఏ టి జి సి బయోటెక్ నూతన ఉత్పాదనలు ఆయిల్ పామ్ లో ఎదురయ్యే ముఖ్య కీటకాల సమస్య కాపాడేందుకు టాబ్లెట్ ల్యూర్ లను విడుదల చేశారు. అనంతరం ప్రొఫెసర్ రాంచంద్రారెడ్డి, ఏటీజీసీ బయోటెక్ సీఈఓ వీ.బీ.రెడ్డి వ్యవస్థాయం తో వచ్చే క్రిమిసంహారక పురుగు మందుల ద్వారా వచ్చే వాతావరణ మార్పులు, పర్యావరణ విద్వంసం లాంటి సమస్యలను ఆపడానికి నూతన ఆవిష్కరణలు ఈ ఫౌండేషన్ ద్వారా చేయబోతున్నామని తెలిపారు. కొత్త ఉత్పాదనలు మేము చేసి నిరూపించమని చెప్పారు. పురుగు మందులు వాడకుండానే పురుగుల సంహారాన్ని చేసి రైతులకు మేలు చేయవచ్చన్నారు. దీని ద్వారా రైతులు మంచి దిగుబడులను సాదిస్తారన్నారు. భారతదేశంలోనే తెలంగాణ రాష్ట్రాన్ని వ్యవసాయంలో అగ్రగామిగా తీర్చిదిద్దేందుకు శ్రమిస్తున్నామన్నారు. ప్రభుత్వ సహకారం ఉంటే రైతులకు మంచి నాణ్యమైన, పర్యవరణహిత ఉత్పాదనలు అందిస్తామని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిధులుగా ఐఏఎస్ రామ చంద్ర తేజవత్, ప్రొఫెసర్ అప్పారావు పొడిలే, నీలిమ, సహారా ఇంటర్నేషనల్ గ్రూప్ మెరెడ్డి రాహుల్ రెడ్డి, డాక్టర్ కె ఆర్ కె రెడ్డి , చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్, శ్రీ బయో ఎస్తేటిక్స్ జీవి, రాజేష్, వైస్ ప్రెసిడెంట్ నాట్ కో ఎటిజిసి సంస్థ అధికారులు డాక్టర్. మార్కండేయ, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్. వీ. బి. రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# అంగరంగ వైభవంగా శ్రీ మల్లికార్జున స్వామి విగ్రహ ప్రతిష్ట




**శామీర్ పేట, (గరుడ వార్త) :** శ్రీ మల్లికార్జున స్వామి విగ్రహ ప్రతిష్ట ఘనంగా అంగరంగ వైభోగంగా జరిగింది. శనివారం తూముకుంట లో శ్రీ మల్లికార్జున విగ్రహ ప్రతిష్ట శామీర్ పేట శ్రీ భవాని రామలింగేశ్వర స్వామి ప్రధానార్చకులు గడియారం మురళీధర్ శర్మ ఆధ్వర్యంలో 11 మంది వేద బ్రాహ్మణుల మంత్రోశ్చరణల మధ్య భక్తుల కోలాహలంతో కన్నుల పండువగ జరిగింది. ఉదయం పుణ్యా వచనము, గణపతి పూజ, దేవత ఆహ్వానం, నవగ్రహ స్థాపితా పూజ జరిగింది. మధ్యాహ్నం ఆలయం వద్ద దాతల సహకారం, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం చేపట్టారు. సాయంత్రం పుట్ట బంగారం పోవుట, గంగ తెప్పకు నిర్వహించారు. రాత్రికి శ్రీ మల్లికార్జున స్వామి, భ్రమరాంబికా దేవి, గొల్ల కేతమ్మ ఒగ్గు కథలను నిర్వహించారు. మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి తో పాటు మున్సిపల్ చైర్మన్ రాజేశ్వరరావు, మాజీ ఎంపీపీ చంద్రశేఖర్ యాదవ్, మున్సిపల్ కౌన్సిలర్లు, వివిధ పార్టీల నాయకులు స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అన్నదానానికి రూ . 1 లక్ష విరాళం అందజేసిన కాసుల ఈశ్వర్ గౌడ్ ను ఆలయ కమిటీ తరఫున ఘనంగా సన్మానించారు. ఉమ్మడి మండలంలోని వివిధ గ్రామాల భక్తులు, ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజా ప్రతినిధులు పెద్ద ఎత్తున పాల్గొని స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. మాజీ సర్పంచ్ లు దయాసాగర్ యాదవ్, ఎద్ద నాగేష్ యాదవ్, లింగం గౌడ్, రామచంద్ర యాదవ్, జ్ఞానేశ్వరి యాదవ్, రాజు యాదవ్, నాగేష్ యాదవ్, వీరారెడ్డి, కృష్ణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# రాజ్యాంగ సమస్యలపై భిన్న దృక్పథాలను ఏకతాటిపైకి తీసుకురావడమే సదస్సు ప్రపదమ లక్ష్యం





**శామీర్ పేట, (గరుడ వార్త) :** పౌరుల హక్కులపై దీర్ఘకాలిక ప్రభావం చూపే రాజ్యాంగ సమస్యలపై భిన్న దృక్పథాలను ఏకతాటిపైకి తీసుకురావడమే సదస్సు ప్రధాన ధ్యేయమని సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నాగరత్న అన్నారు. శనివారం శామీర్ పేటలోని నల్సార్ లో జరిగిన కోర్టులు– రాజ్యాంగం (కోఆర్ట్స్ అండ్ కాన్స్టిట్యూషన్) అనే అంశంపై జరిగిన రెండు రోజుల సదస్సుకు ఆమె ముఖ్యఅతిథిగా విచ్చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా జస్టిస్ నాగరత్న మాట్లాడుతూ... న్యాయవ్యవస్థ పౌరుల పరిశీలనను ఎలా తట్టుకోవాలో వివరిస్తూ రాజ్యాంగ చట్టం సమస్యలను పరిష్కరించుకోవడానికి ఇలాంటి సదస్సులు ఎలా కీలకమవుతాయో వివరించారు. దేశంలో సుప్రీంకోర్టు ఆవిర్భవించి 75 ఏళ్లు పూర్తయిన సందర్భంగా రాజ్యాంగ ఆదర్శాల సాధనలో న్యాయవ్యవస్థ ప్రస్తావాన్ని సదస్సులో ఆమె గుర్తు చేశారు. నోట్ల రద్దు కేసు, సీల్డ్ కవర్ న్యాయ శాస్త్రం, వివాహ సమానత్వం, పునరుత్పత్తి హక్కులు, ఎలక్టోరల్ బాండ్ల గత ఏడాది కాలంలో వచ్చిన కీలక సుప్రీంకోర్టు తీర్పుల ఆవలోకనాన్ని సమర్పించినట్లు ఆమె చెప్పారు. న్యాయాన్ని అందించడంలో న్యాయవ్యవస్థ పాత్ర నుంచి న్యాయ వ్యవస్థ బలం ఎలా ఉద్భవిస్తుందో, రాజ్యాంగం శాశ్వతమైనదని నమ్మకంతో అందరూ రాజ్యాంగానికి తమను తాము ఎలా అంకితం చేసుకోవాలో సదస్సులో ఆమె తెలియజేశారు. అలాగే సదస్సులో నల్సార్ వైస్ ఛాన్సర్ శ్రీకృష్ణదేవరావు, సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ రవీంద్ర బట్, నేపాల్ సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సప్న ప్రధాన మల్లా, తెలంగాణ రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఆరాదే, నల్సార్ రిజిస్ట్రార్ డాక్టర్ విద్యుల్లతా రెడ్డి లు పలు అంశాలపై ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో వివిధ రాష్ట్రాలకు చెందిన పలుకోర్టుల న్యాయమూర్తులు, న్యాయవాదులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలలో అవసరమైన సౌకర్యాలు కల్పించండి: మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా కలెక్టర్ గౌతమ్




**జిల్లా బ్యూరో మేడ్చల్ మల్కాజ్గిరి (గరుడ వార్త) :** అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చే ప్రభుత్వ పాఠశాలలో కనీసం మౌలిక వసతులకు సంబంధించిన పనులను పూర్తి చేయాలని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం రోజున వీసీ మీటింగ్ హాల్లో ఏర్పాటుచేసిన సమావేశంలో కలెక్టర్ గౌతమ్, అదనపు కలెక్టర్ అభిషేక్ అగస్త్య, ఇ ఇ, పి ఆర్, ఈ ఈ ఆర్ అండ్ బి, ఎం ఏ యు డి, ఆర్ డబ్ల్యు స్ ,ఈ డబ్ల్యూ ఐ డి సీ అధికారుల తో కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో త్రాగునీటి సౌకర్యం, తరగతి గదుల మేజర్, మైనర్ మరమ్మతులు, టాయిలెట్లలను, బాలికల కోసం అదనపు టాయిలెట్ల నిర్మాణ పనులు, విద్యుత్ సౌకర్యం, పెయింటింగ్ వంటి మౌలిక వసతుల గురించి సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రతి ప్రభుత్వ పాఠశాలలో చేపట్టాల్సిన పనుల గురించి కార్యాచరణ రూపొందించుకోవాల్సిందిగా కోరారు. జిల్లాలో అందుబాటులో ఉన్న ఇంజనీరింగ్ అధికారులు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లను ఏజెన్సీలను నియమించాలన్నారు. ఇంజనీర్లు క్షేత్రస్థాయిలో పనులను పరిశీలించి అవసరమైన ప్రతిపాదనలు సమర్పించాలని కలెక్టర్ తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలో చేపట్టాల్సిన పనులు గుర్తించాలన్నారు. మౌలిక వసతుల కల్పనతో పాఠశాలల అభివృద్ధికి ఎంతో ఉపయోగపడుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి విజయ్ కుమారి, ప్రణాళిక అధికారి మోహన్ రావు, ఆర్ అండ్ బి ఈ ఈ శ్రీనివాస్ , ఈ డబ్ల్యూ ఐ డి సీ, పంచాయతీ రాజ్, ఏ ఎం ఓ రవీంద్ర రాజ్ సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# ఇంద్రకరణ్ వస్తే సహాయనిరాకరణే

**అదిలాబాద్:** కాంగ్రెస్ పార్టీ గేట్లు తెరవడంతో ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లాలోని బీఆర్ఎస్ నేతలు ఒక్కొక్కరుగా కారు దిగేస్తున్నారు. సిర్పూర్, ముథోల్ మాజీ ఎమ్మెల్యేలు హస్తం పార్టీ కండువా కప్పేసుకున్నారు. మరోవైపు నిర్మల్, ముథోల్, సిర్పూర్ నియోజకవర్గాల్లోని బీఆర్ఎస్ కార్యకర్తలంతా పార్టీ మారారు. తాజాగా మాజీ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి చేరికపై ఉత్కంఠ కొనసాగుతూనే ఉంది. ఆయన పార్టీలోకి రావడాన్ని స్థానిక నేతలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. ఆయన వద్దంటే వద్దంటూ ధర్నాలు చేశారు. మంత్రి సీతక్క సమావేశాల్లో సైతం మాజీ మంత్రిని తీసుకొవద్దని డిమాండ్ చేశారు. పార్టీ జెండా మోసిన లీడర్లు...జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి సీతక్క, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మబొజ్జు...ఎన్నికల సమాయత్తంపై సమావేశాలు నిర్వహించారు. అక్రమార్కులు, పార్టీని నష్టపర్చే విధంగా పని చేసిన ఇతర నేతలను తీసుకోవద్దని విజ్ఞప్తి చేశారు. అయితే అదే సమయంలో సీతక్క...చేరికలు వద్దనొద్దని, ఎవరు వస్తే వారిని తీసుకోవాలని కుండబద్దలు కొట్టినట్లు తెలుస్తోంది. నిర్మల్‌లోని కాంగ్రెస్ కేడర్ ఏకతాటిపైకి వచ్చి...ఇంద్రకరణ్ రెడ్డిని పార్టీలోకి తీసుకోవద్దని ఒత్తిడి చేస్తున్నట్లు సమాచారం. పార్టీ కష్టాల్లో ఉన్నప్పుడు అండగా ఉన్నవారికి సరైన గుర్తింపు, నామినేటెడ్ పదవులివ్వాలని కోరినట్లు పార్టీవర్గాలు చెబుతున్నాయి. దీంతో ఇదంతా ఎటో దారి తీస్తుందని అనుకున్నారో ఏమో కానీ...బ్లాక్ మెయిలర్లను, చెరువు కబ్జాదారులను చేర్చుకోబోమని వెడ్మ బొజ్జు హాట్ కామెంట్స్ చేశారు. మాజీ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డిని ఉద్దేశించే...వెడ్మ బొజ్జు విమర్శలు చేశారన్న కామెంట్స్ వినిపిస్తున్నాయి. మీరు బలంగా ఉంటే పక్కోళ్ల ఎందుకు తీసుకుంటామని మంత్రి సీతక్క పార్టీ నేతలకు స్పష్టం చేశారు. పార్టీ బలోపేతం, ఎంపీ సీటు గెలుపే లక్ష్యంగా పనిచేయాలని ఆదేశించారు. మంత్రి మాటలు ఒక విధంగా ఉంటే...ఎమ్మెల్యే బొజ్జు మరో అర్థం వచ్చేలా ఉండడంతో కేడర్‌లో గందరగోళం నెలకొంది. నిర్మల్ నియోజకవర్గంలోని అన్ని మండలాల నేతలు మాజీ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డిని తీసుకొవద్దని వాదిస్తున్నట్లు సమాచారం. ఇంద్రకరణ్ రెడ్డి మాత్రం ఎప్పుడు కాంగ్రెస్ పార్టీ కప్పేసుకుందామనే ఆలోచనలో ఉన్నారు. ఇప్పటికే ఓ దఫా కాంగ్రెస్ సీనియర్ నేత జానారెడ్డితో భేటీ అయ్యారు. హస్తం పార్టీలో చేరడం కోసం మాజీ మంత్రి విశ్వ ప్రయత్నాలు చేస్తుంటే...ఇదిగో అదిగో చేరిక అంటూ ఆయన అనుచరులు లీకులిస్తున్నారు. వీటన్నింటిన చూస్తున్న నిర్మల్ కాంగ్రెస్ నేతలు...అలాంటి వారిని తీసుకోవడం పార్టీకి నష్టం జరగుతుందని సుతిమెత్తగా హెచ్చరికలు జారీ చేస్తున్నారు. ఆదిలాబాద్ ఎంపీ సీటు గెలవాలంటే అన్ని నియోజకవర్గాల్లో పార్టీ పటిష్టంగా ఉండాలని హైకమాండ్ భావిస్తోంది.

# ఫోన్ ట్యాపింగ్ కేసుపెద్ద చేపల కోసం వల...

**హైదరాబాద్:** తెలంగాణను కుదిపేస్తున్న ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో పోలీస్ శాఖ మరో కీలక పరిణామానికి నాంది పలికింది. గత ప్రభుత్వంలో హైదరాబాద్ టాస్క్ ఫోర్స్ విభాగానికి డీసీపీగా పనిచేసి, ఉద్యోగ విరమణ అనంతరం అక్కడే ఓఎస్డీ (ఆఫీసర్ ఆన్ స్పెషల్ డ్యూటీ) గా పనిచేసిన రాధా కిషన్ రావు ను పోలీసులు అరెస్టు చేశారు. శుక్రవారం కోర్టులో హాజరు పరిచారు.. అంతకుముందు రాధా కిషన్ రావును బంజారా హిల్స్ పోలీస్ స్టేషన్లో గేట్లు మొత్తం మూసేసి ఆయనను విచారించారు. ఈ విచారణకు సంబంధించిన వివరాలు బయటకు రాకుండా పోలీసులు అత్యంత గోప్యత పాటించారు. మాజీ డీఎస్పీ ప్రణీత్ రావు ఇచ్చిన సమాచారం ఆధారంగా రాధా కిషన్ రావును పోలీసులు పలు విషయాలపై విచారించారు. ఇప్పటికే ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం లో ప్రణీత్ రావు పోలీసుల అదుపులో ఉన్నాడు. అతడు ఇచ్చిన వాంగ్మూలం ఆధారంగా అదనపు ఎస్పీలు తిరుపతన్న, భుజంగరావు, మీడియా సంస్థ నిర్వాహకుడు శ్రవణ్ రావు నివాసాలలో పోలీసులు కొద్దిరోజుల క్రితం తనిఖీలు చేశారు. అయితే ఇప్పటికే భుజంగరావు, తిరుపతన్నను పోలీసులు అరెస్టు చేశారు. మిగిలిన వ్యక్తులు అజ్ఞాతంలోకి వెళ్లిపోయారని తెలుస్తోంది. వీరిపై ఇప్పటికే పోలీసులు లుక్ అవుట్ నోటీసులు జారీ చేశారు.రాధా కిషన్ రావు ను అదుపులోకి తీసుకున్న పోలీసులు.. ఆయన హయాంలో క్షేత్రస్థాయిలో చేపట్టిన ఆపరేషన్ల గురించి పోలీసులు సుదీర్ఘంగా విచారించారు. విదేశాల నుంచి పరికరాలు ఎవరు తెప్పించారు? ఎందుకోసం తెప్పించారు? దీని వెనక ఎవరున్నారు? ఎవరి ఆదేశాలతో ఈ పని చేశారు? ప్రణీత్ రావుతో ఎన్ని ఆపరేషన్లు చేయించారు? ఎంతమంది వ్యాపారులను బెదిరించారు? ఆ డబ్బు వసూలులో ఎవరు కీలకపాత్ర పోషించారు? ఆ డబ్బుతో ఏమేం చేశారు? వంటి అంశాల పై పోలీసులు రాధా కిషన్ రావును ప్రశ్నించారు. రాధా కిషన్ రావును ప్రశ్నించిన అనంతరం టాస్క్ ఫోర్స్, ఎస్ఐబీ లో ఇన్ స్పెక్టర్ గా పనిచేసిన గట్టు మల్లును కూడా పోలీసులు బంజర హిల్స్ పోలీస్ స్టేషన్ కు పిలిపించారు. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం పై అతడిని కూడా ప్రశ్నించారు..ఓ ఉన్నతాధికారి ఆయన స్టైల్ లో విచారించడంతో గట్టు మల్లు కీలక విషయాలు వెల్లడించినట్టు ప్రచారం జరుగుతున్నది.రాధా కిషన్ రావు హైదరాబాద్ టాస్క్ ఫోర్స్ లో సుదీర్ఘకాలం పనిచేసినందు వల్ల ఆయన బృందం పరి తీరుపై ఆరోపణలు ఉన్నాయి. గత ప్రభుత్వం లక్ష్యంగా చేసుకున్న ప్రత్యర్థులను వీరు గారికి తెచ్చేవారని విమర్శలున్నాయి. రాధా కిషన్ రావు పై పార్లమెంట్ సభ్యుడిగా ఉన్నారు రేవంత్ రెడ్డి పలు ఆరోపణలు చేశారు. రాధా కిషన్ రావు మల్కాజ్ గిరి ఏసీపీగా ఉన్నప్పుడు వేధింపులకు గురి చేయడంతో ఒక కాంగ్రెస్ నాయకుడు ఆత్మహత్య చేసుకున్నాడనే ఆరోపణలు ఉన్నాయి. విచారణ అనంతరం ఆయన ఆ కేతు నుంచి బయటపడ్డారు. రాధా కిషన్ రావు ఉద్యోగం నుంచి విరమణ పొందినప్పటికీ ఆయన టాస్క్ ఫోర్స్ విభాగంలో కీలకంగా పని చేశారు. నగర కమిషనర్ గా ఎవరున్నప్పటికీ.. ప్రభుత్వ పెద్దల అండదండలు ఉండడంతో రాధా కిషన్ రావు కే అధిక ప్రాధాన్యం దక్కేది. రిటైర్మెంట్ అయినప్పటికీ ఆయన రెండుసార్లు ఓఎస్డీ గా పనిచేశారు. శాసనసభ ఎన్నికల సమయంలో రాధా కిషన్ రావు పై అప్పటి కమిషనర్ సందీప్ కుమార్ శాండిల్య ఎన్నికల కమిషనర్ కు ప్రత్యేక నివేదిక పంపించడంతో ఆయనను టాస్క్ ఫోర్స్ బాధ్యతల నుంచి తొలగించారు. ఎన్నికల అనంతరం కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో రాధా కిషన్ రావు తన పదవికి రాజీనామా చేశారు. రాధా కిషన్ రావు, గట్టు మల్లును పోలీసులు విచారిస్తున్న క్రమంలో బేగం బజారుకు చెందిన కొంతమంది వర్తకులు అజ్ఞాతం లోకి వెళ్లిపోయారు. బేగంబజార్ ప్రాంతంలో హవాలా, గంజాయి దందా ఎక్కువగా సాగుతుంది. ఈ దందాలలో కీలకంగా ఉన్న వారితో రాధా కిషన్ రావు, గట్టుమల్లు ఆర్థిక లావాదేవీలు కొనసాగించారని ఆరోపణలు ఉన్నాయి. రాధా కిషన్ రావు మాత్రమే కాకుండా మరో ముగ్గురు టాస్క్ ఫోర్స్ పోలీసులను కూడా అదుపులోకి తీసుకున్నట్టు తెలుస్తోంది.. వారి ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. వీరిని కూడా రహస్యంగా విచారిస్తున్నట్టు సమాచారం.ప్రణీత్ రావుకు డ్రైవర్ గా పనిచేసిన వ్యక్తితో పాటు ఒక కానిస్టేబుల్ కూడా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. గత ఏడాది డిసెంబర్ 4న ఎస్ఐబీలో హార్డ్ డిస్క్ లను ధ్వంసం చేసి.. వాటిని మూసి నదిలో పారేసినట్టు సమాచారం. ఆ ఘటనలో వీరి ప్రమేయం ఉన్నట్టు పోలీసులు అనుమానిస్తున్నారు. ఈ కేసులో అరెస్టయి చంచల్గూడా జైల్లో ఉన్న భుజంగరావు, తిరుపతన్నను ఐదు రోజులపాటు పోలీసు కస్టడీకి ఇస్తూ నాంపల్లి కోర్టు గురువారం ఆదేశాలు జారీ చేసిన విషయం తెలిసిందే. శుక్రవారం నుంచి ఏప్రిల్ 2 వరకు వారు పోలీస్ కస్టడీలో ఉంటారు. అయితే ప్రణీత్ రావును పోలీస్ కస్టడీకి ఇచ్చేందుకు కోర్టు నిరాకరించింది.

# రూ.35 వేల కోట్ల భారత ఈక్విటీలు ఎఫ్‌పిఐల వశం




న్యూఢిల్లీ : కాస్త ఆలస్యంగా విక్రయాలు జరిగినప్పటికీ విదేశీ పోర్ట్‌ఫోలియో మదుపరులు (ఎఫ్‌పిఐలు) రూ. 35098 కోట్లు విలువ చేసే ఈక్విటీ కొనుగోళ్లతో మార్చిలో నికర కొనుగోలుదారులుగా ఉన్నారు. అంతకు ముందు రెండు నెలల పేలవ ప్రదర్శనను మార్చి నెల కొనుగోళ్లు అధిగమించాయి. క్యాపిటల్ గూడ్స్, ఆటోమొబైల్స్, ఫైనాన్షియల్స్, టెలికమ్, రియల్ ఎస్టేట్ రంగాలలో భారీ కొనుగోళ్లు సాగడం అందుకు దోహదం చేసింది. 2024లో ఇంత వరకు ఎఫ్‌పిఐలు రూ. 10893 కోట్లు విలువ చేస్తే దేశీయ వాటాలు కొనుగోలు చేశారు. జనవరిలో వారు నెట్ విక్రేతలు. వారు రూ. 25744 కోట్లు విలువ చేసే ఈక్విటీలు విక్రయించారు. వారు ఫిబ్రవరిలో రూ. 1539 కోట్లు విలువ చేసే వాటాలు కొనుగోలు చేశారు.

# అవినీతి పురాణం, గురివింద కచేరీ...!




కుమార్తె కవిత అరెస్టయినప్పుడు, కేసీఆర్ ఎందుకు వెంటనే స్పందించలేకపోయారు? కేజ్రీవాల్ అరెస్టును ఖండించినప్పుడు మాత్రమే కవిత పేరు కూడా చేర్చి ఎందుకు మాట్లాడారు? ఆమె అరెస్టయినప్పుడు, కుటుంబసభ్యులు, పార్టీ నాయకులు ఈడీ అధికారులతో వాదనలు చేశారు తప్ప, అదంతా అన్యాయమని గట్టిగా జనం ముందు ఎందుకు అనలేకపోయారు? మద్యం కుంభకోణంలో కల్వకుంట్ల కవిత ప్రమేయం, ఏమంత గర్వకారణమైన అంశం కాదన్న సంకోచం ఏదైనా కేసిఆర్, ఇతర బీఆర్ఎస్ నేతల మనసులను ఆవరించిందా? ఒక కేజ్రీవాల్‌ను అరెస్ట్ చేస్తే వేలకొలది కేజ్రీవాల్‌లు పుట్టుకువస్తారని, అరవింద్ ఒక మనిషి కాదు, ఒక భావన అని ఆమ్ ఆద్మీపార్టీ ఎట్లా గట్టిగా అనగలుగుతోంది? దేశంకోసమే నా జీవితం అంటూ కేజ్రీవాల్ జైలు నుంచి పంపిన సందేశాన్ని ఆయన భార్య ఎట్లా సగర్వంగా దేశం ముందు చదవగలిగింది? పై ప్రశ్నలు, ఒకే కేసులో అరెస్టయిన ఇద్దరిలో ఒకరు నైతికంగా ఎక్కువ, మరొకరు తక్కువ అని చెప్పడం కోసం కాదు. రెండు రాజకీయ సంస్థల ప్రతిస్పందనల్లో ఉన్న తేడాలను చెప్పడానికి కూడా కాదు. ఎన్నికల సందర్భంగా ఆవిష్కృతమయిన రాజకీయవాతావరణాన్ని అర్థం చేసుకోవడానికి ఆ ప్రశ్నలు పనికిరావచ్చు. పెరిగిపోతున్న కర్కశతకు, నిర్దాక్షిణ్యతకు సమాధానంగా రూపుదిద్దుకోగలిగే ప్రతికథనాలను గుర్తించడానికి కూడా సహాయపడవచ్చు. కేసీఆర్ కనుక, మొన్నటి ఎన్నికల్లో అధికారం పోగొట్టుకోకపోయి ఉంటే, ఓడిపోయినాక మరీ ప్రస్తుత దయనీయ స్థితికి ఆయన పార్టీ చేరుకోకపోయి ఉంటే, బహుశా కవిత అరెస్టు జరిగేది కాదేమో? రేపటి కేంద్రప్రభుత్వానికి ఏ విధంగానూ ఆయన ఉపయోగపడగలిగే పరిస్థితి లేదు. ఆ నిరుపయోగత్వం నుంచే కవిత అరెస్టు సులువుగా జరిగిపోయింది. మద్యం కేసులో ఆమె కథానాయిక కాదు. సంధానకర్త వంటి పాత్రలో మాత్రమే ఆమె ఉన్నారట. కేసుకు ఆ పాత్రే కీలకం మరి. కేజ్రీవాల్‌ను అరెస్టు చేయడానికి పూర్వరంగంగా ఆమె అరెస్టు జరిగింది. ఆమెను ప్రధానముద్దాయిల్లో చేర్చి కూడా, అరెస్టు చేయకుండా ఉండే సామర్థ్యం, చాతుర్యం దర్యాప్తు సంస్థలకు ఉన్నాయి కానీ, అంతటి ఔదార్యం ప్రకటించవలసిన అవసరం ఇప్పుడులేదు. కవిత మీద కానీ, బీఆర్ఎస్ మీద కానీ కేంద్రప్రభుత్వం, బీజేపీ, మోదీషా కత్తిగట్టారనుకోవడానికి తగిన రాజకీయ వాదన చెలామణిలో లేదు. తెలంగాణ అధికార కుటుంబ సభ్యురాలై ఉండి కూడా, రాష్ట్ర రాజకీయాలలో అప్రధానమైనపాత్రలోనే మిగిలిపోయిన వ్యక్తి, ఇట్లా రాష్ట్రం దాటి దేశరాజధానిలో ఏదో ధనార్జన మార్గంలో, అది కూడా ఏమంత గౌరవప్రదం కాని మద్యం వ్యాపారంలో, ప్రమేయం పెట్టుకోవడం ప్రజలు హర్షించలేదు. కుంగి కునారిల్లినదశలో, బీఆర్ఎస్‌కు మోదీ మీద కత్తులు నూరగలిగే విలాసత్వమూ లేదు.కేజ్రీవాల్ విషయం అట్లా కాదు. దేశమంతా గెలిచినా ఢిల్లీలో తాము గెలవలేకపోతున్నామని, ఉన్నచోట ఉండకుండా అతను ఇతర రాష్ట్రాలకు విస్తరిస్తున్నాడని, అన్నిటి కంటె మించి, 'ఇండియా కూటమి'లో భాగమయ్యాడని బీజేపీకి ఆయనంటే కోపం ఉంది. కేజ్రీవాల్ అరెస్టులో నైతిక నిష్ఠ కంటె, పగాప్రతీకారాలూ ఎక్కువని అంటే, బీజేపీ వీరాభిమానులు కూడా పెద్దగా ఖండించబోరు. 370, 400 స్థానాల లక్ష్యాలను అందుకోవడానికి కేజ్రీవాల్ ఒక అవరోధం కూడా కావచ్చు. ఇన్ని రాజకీయ కారణాలున్నంత మాత్రాన, కేజ్రీవాల్ మద్యం కుంభకోణంలో లేరని కాదు. కాకపోతే, తన మీద అభియోగం తప్పని, ఇదంతా కక్షసాధింపు అని ఆయన చెప్పుకుంటే జనం వింటారు, హేళన చేయరు. అరవింద్ కేజ్రీవాల్ అవినీతి సొమ్ము తీసుకుని, గోవా ఎన్నికల్లో ఖర్చుపెట్టారని ఈడీయే చెబుతోంది, కవిత విషయంలో ఆ రాజకీయ కారణం కూడా లేదు! సమాజంలోని అన్ని రంగాలకు, ఏదో ఒక నైతికమయిన చెలియలికట్ట ఉంటుంది. కొందరు వ్యక్తుల్లో, కొన్నిచిహ్నాల్లో ఆ హద్దులకు ప్రమాణంగా ఉంటారు. రాజకీయరంగంలో ఒకప్పుడు జయప్రకాశ్ నారాయణ్, తరువాత విపిసింగ్, కొందరికి వాజపేయి, అబ్దుల్ కలాం, అట్లాగే, అన్నా హజారే.. ఆయా కాలాల్లో కొంత నైతిక ప్రభ వెలిగించారు. కారుచీకటి అనుకున్న కాలంలో కూడా జనం ఏదో ఒక ఔన్నత్యాన్ని గుర్తించి లేదా భావించి, దాన్ని ఆశగా నిలుపుకుంటారు. అన్నాహజారే పదిపన్నెండేళ్ల కిందట, ఈ కేజ్రీవాల్ తో కలిసి ఢిల్లీలో చేసిన హడావుడి, రెండో యూపిఎ ప్రభుత్వాన్ని అప్రదిష్ట పాలు చేసింది. భ్రష్టుపట్టిపోవడానికి తగినంత అవినీతి, దుష్పరిపాలన ఆ ప్రభుత్వం చేయలేదని కాదు. నరేంద్రమోదీ వెలిగిపోవడానికి ముందు, యుపిఎ ప్రభుత్వం కేవలం చీకటియుగం మాత్రమేనని నమ్మకంగా చెప్పి, జనాల మనస్సులను సిద్ధం చేసిన కూటమి ఆ నీతిపరులదే! తాము చేసిన అవినీతి వ్యతిరేక ఆందోళన ఇంతటి నిరంకుశ పాలనను తీసుకువస్తుందని ఊహించలేదని ఒక్క యోగేంద్ర యాదవ్ మాత్రమే పశ్చాత్తాపపడ్డట్టున్నారు! తాము ఎటువంటి పర్యవసానాలకు కారణమయ్యారో, సిసోడియా, కేజ్రీవాల్ అనుభవపూర్వకంగా తెలుసుకుంటున్నారు! ఇప్పుడు, నైతికమయిన బెంచ్ మార్క్ లేవీ సమాజంలో లేవని, అక్కరలేదని కూడా బీజేపీ భావిస్తున్నది. నీతికబుర్లు చెప్పేవారందరూ అవినీతిపరులని నిరూపణ అయిందని, బలంగా ఉండి, దేశాన్ని దృఢత్వం వైపు తీసుకువెళ్లగలిగే తన వంటి రాజకీయ శక్తి ఉనికిలో ఉండగా మరొక ఎంపిక అవసరమే లేదని ప్రజలకు చెబుతోంది. ప్రాంతీయపార్టీలు, చిన్నపార్టీలు అన్నీ అయితే కుటుంబ పార్టీలో లేదా అవినీతి పార్టీలో అయి ఉంటాయని ప్రధాని తన సభల్లో పదే పదే చెబుతూ వస్తున్నారు. తను మాత్రమే ప్రజలే కుటుంబంగా జీవిస్తున్నానని చెప్పుకుంటున్నారు. ప్రజల దృష్టిలో ఈ నాయకులను పలచన చేసినంత మాత్రాన సరిపోదు కాబట్టి, ఆ పార్టీల బలాన్ని, బలగాన్ని ఛిన్నాభిన్నం చేయడానికి ఒకవైపు దర్యాప్తు యంత్రాంగాలను, మరొకవైపు రాజకీయచాణక్యాన్ని ప్రయోగిస్తున్నారు. బహుజన సమాజ్ పార్టీ నాయకురాలు మాయావతి కూడా కేసుల పద్మవ్యూహంలో చిక్కుకోవడం వల్ల మాత్రమే తన పార్టీని నిష్క్రియాత్మకం చేసుకోవలసివచ్చిందని చెబుతారు. అఖిలేశ్ యాదవ్ తల మీద కూడా అనేక కత్తులు వేలాడుతున్నాయి. మమతా బెనర్జీ 'ఇండియా కూటమి'కి ఎడంగా మెలగడానికి తగిన కేంద్రకారణమే ఉన్నదని ఊహిస్తున్నారు. నాడు కేసీఆర్ కూడా మాటల్లో మంటలు కురిపించినా, లోలోపల భయభక్తులతో ఉండడానికి కారణాలున్నాయంటారు. జగన్ సంగతి తెలిసిందే. అట్లాగని, ఈ దండోపాయానికి అందరూ, అన్ని వేళలా లొంగిపోతారని అనడానికి లేదు. కొందరు నిలబడతారు, మరికొందరు ఓపిక నశించాక తిరగబడతారు. జైలులో సుదీర్ఘకాలం గడిపినా, ఇంకా కేసులు ముగియకపోయినా, లాలూ ప్రసాద్ బేలగా మారలేదు, జనాకర్షణా కోల్పోలేదు. ఇప్పుడు అరవింద్ కేజ్రీవాల్ కూడా తన మీద జరుగుతున్న రాజకీయదాడికి కుంగిపోయేటట్టు కనిపించడం లేదు. అవినీతి వ్యతిరేక ఉద్యమం చేసి తమ ఓటమికి కారణమయిన కేజ్రీవాల్‌తో కాంగ్రెస్ తన సంబంధాలు మెరుగుపరుచుకోవడం విశేషం. 'ఆప్' విస్తరణ ప్రయత్నాలమీద బీజేపీతో సమానంగా కాంగ్రెస్ కూడా ఒకప్పుడు అసహనం చూపింది. కొంతకాలం కిందట రెండుపార్టీల మధ్య పొత్తు అసాధ్యమనిపించింది. కానీ, సర్దుబాటు చేసుకోవడంతో పాటు, ఆశ్చర్యకరంగా ఇప్పుడు ఒకరికొకరు నిలబడుతున్నారు కూడా. ప్రతిపక్ష 'ఇండియా' కూటమికి గట్టి రాజకీయ నినాదం లేదని అంతా అంటున్నారు కానీ, భారతీయ జనతా పార్టీకి కూడా ఈ సారి నినాదాల కొరత ఉన్నది. పరివార్ వాద్, భ్రష్టాచార్ అన్నీ అయిపోయాయి. అబ్ కీ బార్ మోదీసర్కార్, ఫిర్ ఏక్ బార్ మోదీ సర్కార్ పోయినసారే అయిపోయాయి.

# కరువు సాయమివ్వండి....!

## – జిల్లాలో ఎండిన పంటలతో నష్టపోయిన రైతాంగం



**నల్లగొండ :** జిల్లాలో పంటలు ఎండిపోవడం, చెరువుల్లో నీటితో పాటు భూగర్భజలాలు అడుగంటిపోతున్నాయి. గతేడాదితో పోలీస్తే మూడు మీటర్ల లోతుల్లోకి భూగర్భ జలాలు వెళ్లాయి. పంటలను కాపాడుకునేందుకు రైతులు నానాతంటాలు పడుతున్నారు. రూ.వేలు ఖర్చు చేసి బోర్లు వేయిస్తున్నారు. అందుబాటులో ఉన్న కొద్దిపాటి నీటితో నాలుగు ఎకరాలు సాగు చేసిన రైతులు రెండు ఎకరాలకు నీరందిస్తూ పంటను కాపాడుకుంటున్నారు. పంట్ల తోటల రైతుల పరిస్థితి మరింత దారుణం. అప్పులు చేసి రూ.లక్షలు ఖర్చు చేసి బోర్ల మీద బోర్లు వేస్తున్నారు. అదేవిధంగా కొంతమంది ట్యాంకర్ల ద్వారా నీటిని కొనుగోలు చేసి పొలాలు పారిస్తున్నారు. దశాబ్దకాలం తర్వాత ఉమ్మడి నల్లగొండ జిల్లాలో కరువు తాండవిస్తోంది.
నాగార్జునసాగర్ మొదలుకొని ఇతర రిజర్వాయర్లలో నీళ్లు లేకపోవడం, భూగర్భజలాలు గణనీయంగా పడిపోవడంతో యాసంగి సీజన్‌లో సాగు చేస్తున్న రైతులను ఇక్కట్ల పాలు చేసింది. వరి, వేరుశనగతో పాటు ఇతర పంటల సాగుతో తీవ్రంగా నష్టపోయారు. బత్తాయి, నిమ్మ పండ్ల తోటల రైతులు వ్యయం, ప్రయాసలతో ప్రతికూల పరిస్థితులను ఎదురీదుతున్నారు. ఈ నేపథ్యంలో జిల్లాలో పంటలు నష్టపోయిన రైతులకు, పండ్లతోటల రైతులకు ప్రభుత్వం కరువు ప్రాతిపదికగా సహాయం ప్రకటించాలని ప్రతిపక్ష, రైతుసంఘాల నాయకులు, రైతాంగం డిమాండ్ చేస్తోంది. లోక్‌సభ ఎన్నికల కోడ్ రావడంతో ప్రభుత్వం నుంచి కరువు సాయంపై ఎలాంటి కార్యాచరణకు ఆస్కారం లేకుండాపోయింది. వ్యవసాయ, ప్రణాళికశాఖల అధికారులు సాధారణ రీతిలోనే పంటల దిగుబడుల వివరాలు నమోదు చేస్తున్నారు. కరువుపీడిత ప్రాంతాలను సందర్శించే నిమిత్తం ప్రధాన ప్రతిపక్ష నేత, మాజీ సీఎం కేసీఆర్ ఏప్రిల్‌లో జిల్లాలో పర్యటించేందుకు సిద్ధమవడంతో రాజకీయంగానూ కరువు ప్రధానాంశంగా మారింది. జిల్లాలో గతేడాదితో పోల్చుకుంటే ఈ సీజన్‌లో ఇప్పటికే సుమా రు 5.50 మీటర్ల లోతుకు భూగర్భజలాలు పడిపోయాయి. గతేడాది ఇదే సీజన్‌లో 6.12 మీటర్ల లోతులో భూగర్భజలాలు లభ్యమైతే, ఈ ఏడాది 11.50 మీటర్ల లోతుకు పడిపోయాయి.

# పగ టిపూట తీవ్రమవుతున్న ఉష్ణోగ్రతలు...!

**మంచిర్యాల :** జిల్లాలో సూర్య ప్రతాపం గరిష్ట స్థాయికి చేరుకుంటోంది. వారం రోజులుగా విపరీతమైన ఎండలతో ప్రజలు సతమతమవుతున్నారు. పగటి పూట బయటకు వెళ్లాలంటేనే ఆం దోళనకు గురవుతున్నారు. నాలుగైదు రోజులుగా జిల్లాలో సగటు ఉష్ణోగ్ర తలు 40 డిగ్రీలు నమోదవుతున్నాయి. ఉదయం కాస్త చల్లగా ఉంటున్న వాతావరణం మధ్యాహ్నం విపరీతంగా వేడెక్కుతోంది. రాత్రి 8 గంటల వరకు ఎండ వేడి తగ్గడం లేదు. ఉదయం 10 గంటలకే ఎండ వేడి పెరగడంతో ప్రజలు ఇంటి నుంచి బయటకు వెళ్లేందుకు జంకుతున్నారు. మధ్యాహ్నం సమయంలో రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారుతున్నాయి. జిల్లాలో వారం రోజుల నుంచి ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. మార్చి నెలలోనే ఉష్ణోగ్రతలు రికార్డు స్థాయిలో నమోదవుతుండడం ఆందోళనకు రేకెత్తిస్తోంది. జిల్లాలోని శ్రీరాంపూర్, మందమర్రి, బెల్లంపల్లి సింగరేణి ఏరియాల్లో అండర్ గ్రౌండ్ బొగ్గు బావులతోపాటు ఓపెన్‌కాస్టు మైన్‌లు ఉండడంతో ఇక్కడి వేడి ఎక్కువగా ఉంటోంది. అధిక ఉష్ణోగ్రతలతో ఉక్కపోతతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటు న్నారు. ద్విచక్ర వాహనాలపై బయటకు వెళ్లాలంటేనే ప్రజలు జంకాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. పగటి పూట ఏసీలు ఉపయోగిస్తే కాని ఇండ్లలో ఉండే పరిస్థితి లేదు. కూలర్‌లలోనూ వేడి గాలులు వస్తున్నాయి. మార్చి మాసంలోనే ఎండ తీవ్రత ఇలా ఉంటే రాబోయే రోజుల్లో పరిస్థితి పట్ల ప్రజలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో గడిచిన మూడు రోజుల్లో నమోదైన ఉష్ణోగతల వివరాలు ఇలా ఉన్నాయి. ఈ నెల 24వ తేదీన జిల్లాలో గరిష్ట ఉష్ణోగ్రతలు 40.4 డిగ్రీలు నమోదయ్యాయి. 25న 38.8 డిగ్రీలు, 26న 39.8 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఇదిలా ఉండగా మంగళవారం కాసిపేట మండలం కొండాపూర్‌లో గరిష్టంగా 39.8 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదు కాగా, అత్యల్పంగా తాండూరు మండలంలో 37.5 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. రెండు రోజుల నుంచి జిల్లాలో ఎండ తీవ్రత విపరీతంగా పెరిగిపోయింది. జిల్లా వ్యాప్తంగా బొగ్గు గనులు విస్తరించి ఉండడంతో 40 డిగ్రీల గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. రానున్న ఐదు రోజుల్లో ఉష్ణోగ్రతలు మరింత పెరిగే అవకాశాలున్నాయని హైద్రాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది.

# కార్పొరేట్ కళాశాలల ఇష్టారాజ్యం....!

ప్రస్తుత విద్యా సంవత్సరం ముగియకముందే వచ్చే విద్యా సంవత్సరం అడ్మిషన్లు ప్రారంభించేశారు ప్రైవేట్ కార్పొరేట్ విద్యాసంస్థల వారు. విద్యను వ్యాపారంగా చేసి ఆఫర్ల పేరుతో ఇప్పుడే అడ్మిషన్ తీసుకుంటే 30 నుండి 50% రాయితీ ఉ ంటది, భవిష్యత్‌లో ఎలాంటి అదనపు ఫీజు ఛార్జీలు ఉ ండవంటూ విద్యార్థినీ విద్యార్థులను, వారి తల్లిదండ్రులను ప్రలోభాలకు గురిచేస్తున్నారు. విద్యా సంవత్సరం ప్రారంభానికి మూడు నెలల ముందే కార్పొరేట్ పాఠశాలలు, ఇంటర్ కళాశాలల వారు ముందస్తు ప్రవేశాలకు తెరలేపాయి. ప్రస్తుతం పదో తరగతి వార్షిక పరీక్ష రాస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులకు మాయమాటలు చెబుతూ విద్యార్థులకు సీటు రిజర్వు చేస్తున్నాయి. నిబందనలకు విరుద్ధంగా అడ్మిషన్లు తీసుకుంటున్నా,అడ్మిషన్లు ప్రారంభం అని ప్రచారాలు చేస్తున్న అధికార యంత్రాంగం చూసీచూడనట్లు వ్యవహరిస్తోంది. కార్పొరేట్ కళాశాలలు,పాఠశాలలు రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో, ప్రధాన పట్టణాలతో పాటు పలు ప్రాంతాల్లో పీఆర్ఓలను నియమించుకున్నాయి. వీరు పదో తరగతి విద్యార్థులు తల్లిదండ్రులను మచ్చిక చేసుకొని ఇంటర్‌లో ప్రవేశాలు కల్పిస్తున్నారు. ముందస్తు ప్రవేశాలకు మాత్రమే ఫీజులో రాయితీ ఉంటుందని నమ్మబలుకుతూ కనీసం 60 శాతం ఫీజును ముందే తీసేసుకుంటున్నారు. ఆ మాత్రమైనా చెల్లించకపోతే ఐడీ నెంబర్ రాదని భయపెడుతున్నారు.ఇప్పటికే కొన్ని విద్యాసంస్థలు అడ్మిషన్లు అయిపోయాయి అని బోర్డులు కూడా పెట్టాయి. నిబంధనలకు విరుద్దంగా ప్రైవేట్ కార్పొరేట్ పాఠశాలల, జూనియర్ కళాశాలల యాజమాన్యాలు అక్షరాలతో లక్షల రూపాయల వ్యాపారం చేస్తున్నాయి. పాఠశాలల్లో ఎల్‌కేజీకే లక్ష రూపాయల పైన ఫీజు, అడ్మిషన్ ఫీజు 20 వేలు వసూలు చేస్తున్నారు. అంతే కాకుండా పాఠశాల ఆవరణలోనే పుస్తకాలు యూనిఫామ్, ఇతర స్టేషనరీ వస్తువుల పేరుతో లక్ష వరకు దండుకుంటున్నారు. ఎంపీసీ ,బైపీసీ (ఐఐటీ, నీట్) పేరుతో ఏడాదికి డే స్కాలర్ విద్యార్థికే రూ. 90 వేల నుంచి రూ.లక్షన్నర వరకు ఫీజులు నిర్ణయించారు. ఇదే గ్రూప్ విద్యార్థులు ప్రత్యేక క్యాంపస్ హాస్టల్ అని చదువుకోదలిస్తే ఒక్క సంవత్సరానికే రూ. 2.50,000 లక్షల వరకు ఖర్చవుతుంది. హైదరాబాద్ శివారు ప్రాంతాల్లోని కొన్ని కళాశాలల్లో రెండు సంవత్సరాల ప్యాకేజీ పేరుతో 6 లక్షల రూపాయలు వసూలు చేస్తున్న వైనం. సీఈసీ, ఎంఈసీ, హెచ్ఈసీ గ్రూప్ సివిల్స్ ఫౌండేషన్ పేరుతో కొత్త కోర్సును పరిచయం చేస్తూ సుమారు రూ. 1.65 లక్షల నుంచి రూ. 2 లక్షల వరకు వసూలు చేస్తున్నారు. సీఈసీ, ఎంఈసీ గ్రూప్స్ సీఏ,ఇతర పేర్లు జోడించి రూ. 2 లక్షలకు పైనే డిమాండ్ చేస్తున్నారు. అడ్మిషన్ల కోసం విద్యా సంవత్సరం ప్రారంభమయ్యాక పాఠశాలల్లో, ఇంటర్ బోర్డు నోటిఫికేషన్ విడుదల చేశాక ప్రవేశాలు తీసుకోవాలి. అంతవరకు ఎలాంటి ప్రచారాలు చేయకూడదు. అడ్మిషన్లు తీసుకోవద్దు పీఆర్‌వోల ద్వారా అడ్మిషన్లు చేసుకోకూడదు. కానీ పాఠశాలల వారు, ఇంటర్ కళాశాలల వారు నిబంధనలను తుంగలో తొక్కి కార్పొరేట్ సంస్థలు అడ్డగోలు ప్రచారానికి తెరలేపుతున్నారు. తోక పేర్లతో, అడ్మిషన్లు ప్రారంభమంటూ, అనుమతి లేని ప్రాంతాలల్లో విద్యాసంస్థల నిర్వహణ పెద్ద పెద్ద ఫ్లెక్సీలతో , కరపత్రాల ద్వారా ప్రచారం చేస్తున్న అధికారులు వాటి వైపు కన్నెత్తి చూడరు. వాటిపై చర్యలు తీసుకోలేని స్థితిలో ఉన్నారు. కార్పొరేట్ పాఠశాలల, కళాశాలల యాజమాన్యాలు చేస్తున్న విద్యా దోపిడిని అరికట్టాలి. విద్యాశాఖ, ఇంటర్ బోర్డు అధికారులు పాఠశాలలను, కళాశాలలను తనిఖీ చేసి వారి సౌకర్యాలు, వసూలు చేస్తున్న ఫీజుల వివరాలు తెలుసుకొని నిబంధనలకు విరుద్ధంగా ఇష్టానుసారంగా వ్యవహరిస్తూ అనుమతి లేకుండా నిర్వహిస్తున్న పాఠశాలలను, కళాశాలలను సీజ్ చేయాలి. నిత్యం ప్రైవేట్ కార్పొరేట్ విద్యాసంస్థలపై అధికారుల పర్యవేక్షణ ఉంటే వారు నిబంధనలు పాటిస్తారు కానీ అధికారులు చూసి చూడనట్లు వత్తాసుగా వ్యవహరించడం వల్లే ప్రైవేట్ కార్పొరేట్ విద్యాసంస్థలవారు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. అధికారులు ఇప్పటికైనా రాష్ట్ర వ్యాప్తంగా నిబంధనలకు విరుద్ధంగా ముందస్తు ప్రచారం, అడ్మిషన్లు నిర్వహిస్తు, లక్షలాది రూపాయల ఫీజులు వసూలు చేస్తూ ప్రైవేట్ కార్పొరేట్ విద్యాసంస్థలపై ఉక్కుపాదం మోపాలి. విద్యా సంవత్సరం ప్రారంభానికి మూడు నెలల ముందే కార్పొరేట్ పాఠశాలలు, ఇంటర్ కళాశాలల వారు ముందస్తు ప్రవేశాలకు తెరలేపాయి. ప్రస్తుతం పదో తరగతి వార్షిక పరీక్ష రాస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులకు మాయమాటలు చెబుతూ విద్యార్థులకు సీటు రిజర్వు చేస్తున్నాయి. నిబందనలకు విరుద్ధంగా అడ్మిషన్లు తీసుకుంటున్నా,అడ్మిషన్లు ప్రారంభం అని ప్రచారాలు చేస్తున్న అధికార యంత్రాంగం చూసీచూడనట్లు వ్యవహరిస్తోంది. కార్పొరేట్ కళాశాలలు,పాఠశాలలు రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో, ప్రధాన పట్టణాలతో పాటు పలు ప్రాంతాల్లో పీఆర్ఓలను నియమించుకున్నాయి. పాఠశాలల్లో ఎల్‌కేజీకే లక్ష రూపాయల పైన ఫీజు, అడ్మిషన్ ఫీజు 20 వేలు వసూలు చేస్తున్నారు. అంతే కాకుండా పాఠశాల ఆవరణలోనే పుస్తకాలు యూనిఫామ్, ఇతర స్టేషనరీ వస్తువుల పేరుతో లక్ష వరకు దండుకుంటున్నారు. ఎంపీసీ ,బైపీసీ (ఐఐటీ, నీట్) పేరుతో ఏడాదికి డే స్కాలర్ విద్యార్థికే రూ. 90 వేల నుంచి రూ.లక్షన్నర వరకు ఫీజులు నిర్ణయించారు. ఇదే గ్రూప్ విద్యార్థులు ప్రత్యేక క్యాంపస్ హాస్టల్ అని చదువుకోదలిస్తే ఒక్క సంవత్సరానికే రూ. 2.50,000 లక్షల వరకు ఖర్చవుతుంది. అంతే కాకుండా పాఠశాల ఆవరణలోనే పుస్తకాలు యూనిఫామ్, ఇతర స్టేషనరీ వస్తువుల పేరుతో లక్ష వరకు దండుకుంటున్నారు. ఎంపీసీ ,బైపీసీ (ఐఐటీ, నీట్) పేరుతో ఏడాదికి డే స్కాలర్ విద్యార్థికే రూ. 90 వేల నుంచి రూ.లక్షన్నర వరకు ఫీజులు నిర్ణయించారు. ఇదే గ్రూప్ విద్యార్థులు ప్రత్యేక క్యాంపస్ హాస్టల్ అని చదువుకోదలిస్తే ఒక్క సంవత్సరానికే రూ. 2.50,000 లక్షల వరకు ఖర్చవుతుంది.

# ఏప్రిల్ 6న కాంగ్రెస్ కీలక విషయాలు వెల్లడిస్తుంది





న్యూఢిల్లీ: సార్వత్రిక ఎన్నికలు దగ్గరపడుతున్న తరుణంలో పార్టీ నేతల ప్రచారం పెద్ద ఎత్తున సాగుతోంది. ఎవరికి వారు మేనిఫెస్టోలు విడుదల చేస్తూ ప్రజలను ఆకట్టుకునే ప్రయత్నాలు చేస్తున్నారు.కాగా కాంగ్రెస్ పార్టీ తన మేనిఫెస్టోను వచ్చే నెలలో విడుదల చేయనున్నట్లు సమాచారం. జైపూర్‌లో జరిగే బహిరంగ సభలో కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే , కాంగ్రెస్ నేతలు సోనియాగాంధీ, రాహుల్ గాంధీ కలిసి పార్టీ మేనిఫెస్టోను ఏప్రిల్ 6న విడుదల చేస్తారని పార్టీ రాజస్థాన్ ఇన్‌చార్జి 'సుఖ్‌జీందర్ సింగ్ రంధవా' పేర్కొన్నారు. ఎన్నికల వ్యూహం సమావేశం పూర్తయిన తరువాత విలేకరులతో మాట్లాడుతూ రంధవా ఈ విషయాన్ని వెల్లడించారు. త్వరలో జరగనున్న బహిరంగ సభ ఏర్పాట్ల గురించి చర్చించినట్లు.. దీనికి సంబంధించిన బాధ్యతలను రాజస్థాన్ మాజీ ముఖ్యమంత్రి అశోక్ గెహ్లాట్, కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు గోవింద్ సింగ్ దోతస్రాకు బాధ్యతలు అప్పగించారు.

## ప్రధానిగా, మంచి తండ్రిగా వ్యవహరించడం కష్టం



లండన్: ఓ పక్క పలు సమస్యలు ఎదుర్కొంటున్న దేశానికి ప్రధానిగా వ్యవహరించడం..మరోపక్క ఇద్దరు చిన్న పిల్లలకు మంచి తండ్రిగా ఉంటూ సమన్వయం చేసుకోవడం తనకు కష్టమైనపనిగా ఉందని బ్రిటన్ ప్రధానమంత్రి రిషి సునాక్ పేర్కొన్నారు. 'ద టైమ్స్' కోసం కన్జర్వేటివ్ పార్టీ మాజీ నేత విలియం హేగ్‌కు సునాక్ పాడ్‌కాస్ట్ ఇంటర్వ్యూ ఇచ్చారు. ఈ సందర్భంగా తాను ఎదుర్కొంటున్న సవాళ్లపై స్పందించారు. తన కుమార్తెలైన కృష్ణ (12), అనౌష్క (11)లపై దృష్టి సారించడానికి తగినంత సమయం తనకు దొరకడంలేదంటూ ఆందోళనకు గురవుతున్నట్లు తెలిపారు. "వాళ్లే నా ప్రపంచం అనుకునే ఇద్దరు కుమార్తెలు నాకున్నారు.

# డానియల్ కాహ్నెమన్ మృతి



**శాన్‌ఫ్రాన్సిస్కో :** నోబెల్ బహుమతి గ్రహీత, ప్రముఖ కాగ్నిటివ్ సైకాలజిస్ట్ డానియల్ కాహ్నెమన్ (90) బుధవారం మరణించారు. ఇజ్రాయెల్ మూలాలున్న ఆయన.. మనుషులు నిర్ణయాలు తీసుకునే విధానంపై లోతైన పరిశోధనలు చేసి ప్రపంచప్రఖ్యాతి గడించారు. ఆయన పలు యూనివర్శిటీల్లో అధ్యాపక, పరిశోధన బాధ్యతలు నిర్వర్తించారు.

డానియెల్ కాహ్నెమాన్, ఆయన సహచరుడు అమోస్ ట్వర్స్కీలు ఆర్థిక శాస్త్ర రంగాన్ని పునర్‌నిర్మించారు. మనుషులు 'హేతుబద్ధ నటులు' అని ఏకారు కొనాలి, ఏ ఉద్యోగం ఎంపిక చేసుకోవాలని వంటి విషయాల్లో ఎంపికను స్పష్టంగా అంచనా వేయగలరని వివరించారు. వీరు 2011లో విడుదల చేసిన పరిశోధనా పుస్తకం "థింకింగ్, ఫాస్ట్ అండ్ స్లో" అత్యధికంగా అమ్ముడైంది. కాహ్నెమాన్‌కు 2002లో నోబెల్ బహుమతి లభించింది. అనిశ్చిత పరిస్థితుల్లో మనుషులు నిర్ణయాలు తీసుకునే నిర్ణయాల తీరును ఆర్థికశాస్త్రంతో అనుసంధానం చేస్తూ ఆయన చేసిన పరిశోధనకు ఈ ప్రతిష్ఠాత్మక అవార్డు దక్కింది.

## నిన్న అమెరికా, నేడు ఐరాస..
## భారత అంతర్గత వ్యవహారాలపై వ్యాఖ్యలు!



**ఐరాస :** భారత్ సహా ఎన్నికలు జరగనున్న అన్ని దేశాల్లో ప్రజల రాజకీయ, పౌర హక్కులకు రక్షణ ఉంటుందని భావిస్తున్నామని ఐక్యరాజ్య సమితి ప్రధాన కార్యదర్శి ఆంటోనియో గుటెరస్ అధికార ప్రతినిధి స్టీఫెన్ డుజారిక్ అన్నారు.

ప్రతిఒక్కరికీ స్వేచ్ఛగా ఓటు వేసే వాతావరణం ఉంటుందని ఆశిస్తున్నామని వ్యాఖ్యానించారు. ఎన్నికల ముందు దిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ అరెస్టు, కాంగ్రెస్ పార్టీ బ్యాంకు ఖాతాలను స్తంభింపజేయటంతో భారత్‌లో నెలకొన్న రాజకీయ పరిస్థితులను ఓ విలేకరి ప్రస్తావించగా.. డుజారిక్ పైవిధంగా స్పందించారు.కేజ్రీవాల్ అరెస్టుపై ఇప్పటికే జర్మనీ, అమెరికా సైతం స్పందించిన విషయం తెలిసిందే. కాంగ్రెస్ పార్టీ బ్యాంకు ఖాతాల వ్యవహారాన్నీ అగ్రరాజ్యం ప్రస్తావించింది.

## తమిళనాడు బీజేపీ చీఫ్ అన్నామలైకి కనిమొళి స్ట్రాంగ్ కౌంటర్



చెన్నై: తమిళనాడు బీజేపీ అధ్యక్షుడు అన్నామలైకి డీఎంకే ఎంపీ కనిమొళి స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా గురువారం(మార్చ్ 28)రాత్రి కరూర్‌లో నిర్వహించిన సభలో కనిమొళి మాట్లాడారు.'ప్రస్తుతం జైలులో ఉన్న మాజీ మంత్రి సెంథిల్ బాలాజీ గతంలో కరూర్ నుంచి పోటీ చేశారు. సెంథిల్ బాలాజీ భయంతోనే ఈ ఎన్నికల్లో అన్నామలై కరూర్ నుంచి పోటీ చేయడం లేదు' అని కనిమొళి సెటైర్లు వేశారు. గతంలో కరూర్ నుంచి ఒక మంత్రి ఉండేవాడని, ఆయన ప్రస్తుతం జైలులో ఉన్నాడని ఇటీవల కరూర్‌లో నిర్వహించిన ప్రచారంలో అన్నామలై ప్రస్తావించినందునే కనిమొళి ఆయనకు కౌంటర్ ఇచ్చారు. పార్లమెంటులో మాట్లాడిన ఎంపీలను సస్పెండ్ చేస్తారని, బయటమాట్లాడిన వారిని జైలుకు పంపుతారని కేంద్ర ప్రభుత్వంపై కనిమొళి విమర్శలు గుప్పించారు.

## వరంగల్ బరిలో ఎవరు..

వరంగల్: వరంగల్ ఎంపీ టికెట్ కడియం కావ్య తిరస్కరించడంతో ఆ స్థానం ఖాళీ అయింది. దీంతో పలువురు సీనియర్ నేతలు ఆ స్థానం ను?ంచి పోటీ చేసేందుకు ప్రయత్నిస్తున్నారు. బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్, మాజీ కార్పొరేషన్ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్ వరంగల్ ఎంపీ టికెట్ ఆశిస్తున్నట్లు తెలుస్తోంది. అలాగే మరో కీలక నేత ఇటీవల ప్రజాశాంతి పార్టీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు అయిన ప్రముఖ సినీ నటుడు బాబూ మోహన్‌ను వరంగల్ బరిలో ఉంచాలని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఆయనకు ఫోన్ చేసినట్లు చెబుతున్నారు. అందరి కంటే ఎక్కువగా తాటికొండ రాజయ్య పేరు ఎక్కువగా వినిపిస్తోంది. ప్రస్తుతం ఆయన బీఆర్ఎస్ కు రాజీనామా చేశారు. కానీ కాంగ్రెస్ పార్టీ చేర్చుకోలేదు. టిక్కెట్ కోసం పరిశీలన చేయలేదు. దీంతో అటూ ఇటూ కాకుండా అయిపోయారరు. ఇటీవల అసెంబ్లీ ఎన్నికల్లో రాజయ్యకు టిక్కెట్ నిరాకరించి కడియం శ్రీహరికి కేసీఆర్ చాన్సిచ్చారు. ఇప్పుడు పార్లమెంట్ టిక్కెట్ కూడా కడియం కుమార్తెకే ఇచ్చారు. అయినా ఆయన పార్టీకి గుడ్ బై చెప్పారు. కడియం కావ్య ఎన్నికల్లో పోటికి నిరాకరించి కాంగ్రెస్ పార్టీలో చేరేందుకు సిద్ధమైన నేపథ్యంలో రాజయ్యను బరిలోకి దింపాలని బీఆర్ఎస్ ఆలోచిస్తున్నట్టు సమాచారం. ఈ మేరకు ఆయనతో బీఆర్ఎస్ నేతలు సంప్రదింపులు జరుపుతున్నట్టు తెలుస్తోంది. గత అసెంబ్లీ ఎన్నికల్లో టికెట్ ఇవ్వకపోవడంతో బీఆర్ఎస్ పార్టీకి రాజయ్య రాజీనామా చేశారు. స్టేషన్‌ఘన్‌పూర్ టికెట్ ఆశించి భంగపడటంతో ఆయన బీఆర్ఎస్ నుంచి బయటకు వచ్చారు. అయితే వేరే ఏ పార్టీలోనూ చేరకపోవడంతో వరంగల్ ఎంపీ ఎన్నికల్లో ఆయనను పోటీచేయిందుకు జిల్లాకు చెందిన బీఆర్ఎస్ మంతనాలు సాగిస్తున్నారు. రాజయ్య కూడా పోటీచేసేందుకు ఆసక్తి చూపిస్తున్నట్టు తెలుస్తోంది. త్వరలోనే బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌తో ఆయన భేటీ అవుతారని సమాచారం. తన నిర్ణయాన్ని కేసీఆర్‌కు తెలియజేసే అవకాశముందని తెలుస్తోంది. బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థిగా ఖరారైన కడియం శ్రీహరి కుమార్తె కావ్య కాంగ్రెస్ పార్టీలో చేరేందుకు సిద్ధమయ్యారు. కాంగ్రెస్ నుంచి ఆమెకు టికెట్ ఇచ్చే అవకాశముందని ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలో సీనియర్ నాయకుడైన రాజయ్య పేరును బీఆర్ఎస్ తెరపైకి తెచ్చింది. చాలా కాలంగా కడియం శ్రీహరి, రాజయ్య మధ్య ఆధిపత్య పోరు నడుస్తోంది. ఒకవేళ కడియం శ్రీహరి కుమార్తెకు కాంగ్రెస్ టికెట్ ఇస్తే.. రాజయ్యే సరైన ప్రత్యర్థి అవుతారని బీఆర్ఎస్ భావిస్తున్నట్టు తెలుస్తోంది. ఎర్రోళ్ల శ్రీనివాస్ పేరు కూడా వినిపిస్తున్నప్పటికీ జిల్లా నేతలు రాజయ్య వైపు మొగ్గు చూపిస్తున్నట్టు చెబుతున్నారు. కేసీఆర్‌కు బాబూమోహన్ కు కూడా మంచి అనుబంధం ఉంది. కేసీఆర్ ఏ నిర్ణయం తీసుకుంటారన్నదానిపై ఆసక్తి ఏర్పడింది.

## మాజీ కేంద్ర మంత్రి ప్రఫుల్‌పటేల్‌కు సీబీఐ క్లీన్‌చిట్..



**న్యూఢిల్లీ :** మాజీ కేంద్ర మంత్రి, ఎన్సీపీ నేత ప్రఫుల్ పటేల్ యూపీఏ ప్రభుత్వ హయాంలో జరిగిన విమానాల లీజు వ్యవహారంలో ఎలాంటి అవినీతికి పాల్పడలేదని సీబీఐ తాజాగా క్లీన్ చిట్ ఇచ్చింది.ఢిల్లీలో ఈ కేసు విచారణ జరుగుతున్న కోర్టులో సీబీఐ ఈ మేరకు దర్యాప్తు క్లోజర్ రిపోర్టు దాఖలు చేసింది. యూపీఏ హయంలో ప్రఫుల్ విమానయాన శాఖ మంత్రిగా ఉన్నపుడు ఎయిర్ ఇండియా విమానాల లీజులో అవినీతి జరిగిందనడానికి ఎలాంటి ఆధారాలు లేవని క్లోజర్ రిపోర్టులో సీబీఐ పేర్కొంది. ఈ క్లోజర్ రిపోర్టును విచారించి కేసును మూసివేసే అంశంలో నిర్ణయం తీసుకునేందుకుగాను ఏప్రిల్ 15న హాజరుకావాలని కేసు దర్యాప్తు అధికారికి కోర్టు నోటీసులు జారీ చేసింది. శరద్‌పవార్ అధ్యక్షుడిగా ఉన్న ఎన్సీపీని ఆయన మేనల్లుడు అజిత్‌పవార్ చీల్చి మహారాష్ట్రలో బీజేపీ నేతృత్వంలో ఉన్న ఎన్డీఏ ప్రభుత్వంలో భాగస్వామిగా చేరిన విషయం తెలిసిందే. సరిగ్గా ఇది జరిగిన 8 నెలల తర్వాత ఎన్సీపీ ముఖ్య నేత ప్రఫుల్‌పటేల్‌కు సీబీఐ క్లీన్‌చిట్ ఇవ్వడం చర్చనీయాంశమవుతోంది. అవసరం లేకున్నా ఎయిర్‌ఇండియా కోసం అత్యంత ఎక్కువ ఖర్చుతో విమానాలు లీజుకు తీసుకున్నారన్న ఆరోపణలపై ప్రఫుల్‌పటేల్ మీద 2017లో సీబీఐ కేసు నమోదు చేసింది. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు సీబీఐ ఈ కేసును దర్యాప్తు చేసింది.

# పిల్లల్లో పెరుగుతున్న చికెన్ పాక్స్......!

ఎండాకాలం వచ్చిందంటే వేడితో చాలా జాగ్రత్తగా ఉండాలి. వేడి వల్ల, ఎండల వల్ల ఎలాంటి సమస్యలు అయినా రావచ్చు. ముఖ్యంగా పిల్లలకు కూడా ఈ వేడి చాలా ప్రమాదం.ముఖ్యంగా ఉష్ణోగ్రతలు పెరుగుతున్నప్పుడు చికెన్ పాక్స్ పెరిగే అవకాశం ఎక్కువగా ఉంటుంది. చికెన్ పాక్స్ ను ఒక్కొక్కరు ఒక్కో విధంగా పిలుచుకుంటారు. అమ్మవారు, ఆటలమ్మ, పెద్ద తల్లి, చిన్న తల్లి, తల్లి పోయడం, మాత, శీతాలమ్మ అంటూ పిలుచుకుంటారు. కానీ ఇదొక ఇన్ఫెక్షన్ అంటారు వైద్యులు. వారిసెల్లా జోస్టర్ ద్వారా వ్యాపిస్తుందట చికెన్ పాక్స్. ఇది ఒక అంటువ్యాధి కూడా. చికెన్ పాక్స్ వచ్చిన వ్యక్తిని ముట్టుకున్నా.. వారి వద్ద ఉన్నా కూడా వెంటనే మరొక వ్యక్తికి సోకే ప్రమాదం ఉంటుంది. ఈ వైరస్ గాలి ద్వారా కూడా సోకే ప్రమాదం ఎక్కువగా ఉంటుంది. ఈ మధ్య కాలంలో పిల్లలకు అధికంగా చికెన్ పాక్స్ వస్తుంది కాబట్టి వైరస్ సోకిన వారికి పిల్లలను దూరంగా ఉంచడమే మంచిది. కేరళలో రీసెంట్ గా చికెన్ పాక్స్ వల్ల తొమ్మిది మంది పిల్లలు మరణించారని తెలిపింది ఆరోగ్య శాఖ. రోగనిరోధక శక్తి తక్కువగా ఉన్నవారికే ఈ వ్యాధి సోకుతుంది. పిల్లల్లో, గర్భిణీలలో ఈ వైరస్ ఎక్కువగా సోకే అవకాశం ఉందట. గర్భిణీ స్త్రీలకు చికెన్ పాక్స్ సోకితే ప్రమాదం మరింత ఎక్కువగా ఉ ంటుందట. పిండానికి కూడా హాని కలిగిస్తుంది ఈ అంటు వ్యాధి. ఈ వ్యాధికి సరైన చికిత్స అందించకపోతే మరణించే అవకాశం కూడా ఎక్కువే. శరీరంలోకి వైరస్ ప్రవేశించిన తర్వాత మొదటి 10-20 రోజుల్లో కాలేయం, ప్లీహంలో వృద్ధి చెందుతుంది అంటున్నారు నిపుణులు. ఆ తర్వాత శరీరం మొత్తం వ్యాపిస్తుందట. రెండవ దశలో 24-48 గంటలు గడిచిన తర్వాత ఒళ్లు నొప్పులు, నీరసం, జ్వరం వంటి లక్షణాలు ఎక్కువ అవుతాయి.జ్వరం తర్వాత ఎర్రటి పొక్కులు ఛాతి, వీపు మీద వస్తుంటాయి. ఆ తర్వాత కాళ్లు, చేతులకు కూడా వ్యాపిస్తాయి. ఈ పొక్కులు క్రమంగా పెరుగుతూ నీటి బుడగల్లా మారి మధ్యలో గుంట పడుతుంది.



## మామిడికాయలు తినడం వల్ల ఎన్ని ప్రయోజనాలో!




ఎండ వేడి ఈ సారి మార్చి నెలలోనే మొదలైపోయింది. రోజు రోజుకు ఎండలు పెరిగిపోతున్నాయి తప్ప తగ్గడం లేదు. పూర్తిగా ఎండాకాలం రాకముందే భానుడి భగభగలకు జనాలను భయపెడుతున్నాయి.ఉదయం 9 గంటలకే ఎండ వేడి బాగా ఎక్కువగా ఉండటంతో.. మధ్యాహ్నం ఇళ్ల నుంచి బయటకు రావాలంటేనే ప్రజలు జంకుతున్నారు. మార్చి చివరలోనే ఉష్ణోగ్రతలు 40 డిగ్రీలకు వరకు ఉండటంతో భగ్గుమంటున్న భానుడు ఉగ్రరూపానికి అల్లాడిపోతున్నారు. ఇక ఏప్రిల్, మే నెలలో ఇంకా ఎండల తీవ్రత ఎంతగా ఉ ంటుందోనని ఆందోళన చెందుతున్నారు. దీంతో ఈ ఎండను తట్టుకునేందుకు అప్పుడే సమ్మర్ డైట్ మొదలెట్టారు. కొందరు వేసవిలో అందుబాటులో ఉండే పండ్ల రసాన్ని తాగుతూ.. శరీరాన్ని వేడి నుంచి కాపాడుకుంటున్నారు. అయితే ఎండాకాలంలో చిన్నా పెద్ద ఎంతగానో ఇష్టపడే మామిడికాయలు కూడా ఈ సీజన్‌లోనే అందుబాటులో ఉ ంటాయి. కానీ ఇవి శరీరానికి వేడి చేస్తాయని చెప్పి చాలా మంది తినడానికి సంకోచిస్తారు. దీంతో మామిడికాయలకు, జ్యూస్‌కు దూరంగా ఉంటారు. కానీ పచ్చి మామిడికాయలను తినడం వల్ల ఆరోగ్యానికి పలు ప్రయోజనాలు కలుగుతాయని నిపుణులు సూచిస్తున్నారు. పచ్చి మామిడిలో విటమిన్ సి, ఎ, కె, బి 6, కాల్షియం, ఫైబర్, మెగ్నీషియం, పొటాషియం, ఐరన్, యాంటీ ఆక్సిడెంట్లు వంటివి ఉండి శరీరానికి పోషకాలను అందించి మంచి లాభాలను కలిగిస్తాయి.అయితే ఇందులో ఉండే సి విటమిన్ వల్ల రోగనిరోధక శక్తి పెరుగుతుంది. దీంతో ప్రమాదకరమైన వ్యాధులు రాకుండా మనల్ని మనం రక్షించుకోవచ్చు. చిగుళ్ల ఇన్‌ఫెక్షన్స్, రక్తం కారడం, పన్ను నొప్పి వంటి సమస్యల నుంచి ఉపశమనం పొందాలంటే కచ్చితంగా పచ్చి మామిడికాయ తినాలి. అలా చేస్తే బ్యాక్టీరియా, క్రిములు నశించడంతో పాటు పళ్లపై ఉ న్న ఎనామెల్ దృఢంగా ఉంటుంది. ఇందులో ఫైబర్ పుష్కలంగా ఉండటం వల్ల మధుమేహం వ్యాధి తగ్గడంతో పాటుగా రక్తంలోని చక్కెర స్థాయిలు అదుపులో ఉంటాయి. పచ్చి మామిడిలో పాలి ఫెనాల్స్ ఉంటాయి. కాబట్టి దీనిని తీసుకోవడం వల్ల ప్రమాదకరమైన క్యాన్సర్‌తో పోరాడుతుంది. అలాగే పెద్ద ప్రేగు, ఊపిరితిత్తులు, రొమ్ము క్యాన్సర్ వంటి క్యాన్సర్ కణాలు ఏర్పడకుండా చేస్తుంది. ముఖ్యంగా ఎండాకాలం డీహైడ్రేషన్ సమస్యతో బాధపడేవారు పచ్చి మామిడికాయలు తినడం వల్ల శరీరం హైడ్రేట్‌గా ఉంటుంది. ఇందులోని నీటి శాతం వడదెబ్బ తగలకుండా కాపాడుతుంది. అలాగే జీర్ణక్రియ పనితీరును మెరుగుపరుస్తుంది. ఇటీవల చాలా మంది ఒకే చోట ఎక్కువ సమయం పాటు కూర్చుని పని చేయడం వల్ల అధిక బరువు సమస్యతో బాధపడుతున్నారు. దీంతో ఎన్ని డైట్స్ ఫాలో అయినప్పటికీ ఫలితం లేకుండా పోయింది. అలాంటి వారు పచ్చి మామిడి తినడం వల్ల బరువు తగ్గే అవకాశం ఉంది. గత కొద్ది కాలంగా చిన్నా,పెద్దా అని తేడా లేకుండా ఎంతో మంది హార్ట్ ఎటాక్‌తో ప్రాణాలు కోల్పోయిన సంఘటనలు ఎన్నో చోటు చేసుకున్న విషయం తెలిసిందే. అయితే పచ్చి మామిడి తినడం వల్ల ఇందులోని పొటాషియం, మెగ్నీషియం గుండెను ఆరోగ్యంగా ఉండేలా చేస్తాయి. అంతేకాకుండా రక్తనాళాల పనితీరును మెరుగుపరచడంలో సహాయపడతాయి. మార్చి చివరలోనే ఉష్ణోగ్రతలు 40 డిగ్రీలకు వరకు ఉండటంతో భగ్గుమంటున్న భానుడు ఉగ్రరూపానికి అల్లాడిపోతున్నారు. ఇక ఏప్రిల్, మే నెలలో ఇంకా ఎండల తీవ్రత ఎంతగా ఉంటుందోనని ఆందోళన చెందుతున్నారు. దీంతో ఈ ఎండను తట్టుకునేందుకు అప్పుడే సమ్మర్ డైట్ మొదలెట్టారు. కొందరు వేసవిలో అందుబాటులో ఉండే పండ్ల రసాన్ని తాగుతూ.. శరీరాన్ని వేడి నుంచి కాపాడుకుంటున్నారు.

## పుచ్చకాయ గింజలను పారేస్తున్నారా..?



చిన్న పిల్లలకు ఏవైనా గింజలు తింటే కడుపులో మొక్కలు వస్తాయని చెబుతుంటారు. వామ్మో కడుపులో చెట్లు అవుతాయంట ఈ గింజలు తినవద్దు అని ఏవైనా ఉ మ్మేస్తుంటారు చిన్నపిల్లలు.వారే కాదు పెద్దవారు కూడా చాలా గింజలను తినరు. అయితే పుచ్చకాయ గింజలను కూడా ఇలాగే ఉమ్మేస్తారు. కానీ వీటివల్ల చాలా లాభాలు ఉన్నాయి అంటున్నారు నిపుణులు. మరి ఓ సారి లుక్ వేసేయండి. పుచ్చకాయ గింజల్లో చాలా ఔషధ గుణాలు ఉన్నాయట. ఇందులో కేలరీలు కూడా చాలా తక్కువ. సో బరువు పెరుగుతారు అనే భయం అక్కర్లేదు. అంతేకాదు ఇందులో శరీరానికి అవసరం అయ్యే రాగి, జింక్, పొటాషియం, మెగ్నీషియం, ఐరన్ వంటి ఖనిజాలతో పాటు పోషకాలు కూడా మెండుగా ఉన్నాయి. ఈ పుచ్చకాయ వల్ల శరీరానికి రోగనిరోధక శక్తి పెరుగుతుంది. మెగ్నీషియం అధికంగా ఉ ండటం వల్ల రక్తపోటును తగ్గిస్తుందట. గుండెకు నేరుగా అనుసంధానం అవుతుంది కాబట్టి గుండె ఆరోగ్యం కూడా పదిలం అవుతుంది. ఇక రక్తపోటును నియంత్రించడంలో తోడ్పడుతుంది. ఇందులో ఉండే ఖనిజ పోషకాలు ఎముకల శక్తికి మంచి బలాన్ని ఇస్తాయి. శరీర పెరుగుదల, మార్పులను నియంత్రించడంలో సహాయం చేస్తాయి పుచ్చకాయ గింజలు. శరీరంలో విడుదలయ్యే యాసిడ్ లను నియంత్రిస్తాయట. మధుమేహం ఉన్నవారికి మరింత ఉపయోగం ఇవి. ఈ గింజలను ఎండలో ఎండబెట్టి ఫ్రై చేసుకొని కూడా తినవచ్చట. పుచ్చకాయ గింజల నుంచి బర్ఫీలను కూడా తయారు చేస్తారు. బెల్లం వేసి లడ్డూలా చేసుకుంటారు. అంతేకాదు పొడి చేసి కూడా తింటారు కొందరు. విత్తనాలను మెత్తగా చేసి షేక్ ను చేసుకోవచ్చు. అందేకాదు వెన్న కూడా తయారు చేసుకోవచ్చట. ఆరోగ్యం మాత్రమే కాదు ఈ గింజల వల్ల చర్మానికి కూడా సంరక్షణ అందుతుంది. జుట్టు ఆరోగ్యాన్ని పెంచుతాయి. ఈ గింజల నూనె కూడా లభిస్తుంటుంది. చర్మంపై రుద్ది మసాజ్ చేస్తే కొన్ని చర్మ సమస్యలు తొలుగుతాయట. జట్టు కు రాస్తే జుట్టు ఆరోగ్యం పెరుగుతుంది.

## పోషకాలు అందించే ఆకు...!



మన చుట్టూ ఉండే పరిసర ప్రాంతాలలో కూడా మనకు తెలియని ఎన్నో ఆకుకూరలు అందులో ఉండే పోషకాలను మనం వదిలేస్తూ ఉంటాము.. అలాంటి ఆకుకూరలలో గంగ పాయల ఆకు కూడా ఒకటి.. ఈ ఆకు పేరు వినకపోయినా ఈ ఆకు చెట్టును మాత్రం చూస్తే ఇట్టే గుర్తు పట్టేస్తారు. అయితే ఈ జాతి మొక్కలలో నాలుగు రకాల మొక్కలు ఉ ంటాయి ముఖ్యంగా సన్ పాయల, పెద్ద పావిలి, బొడ్డు పాయల, పుల్లపాయల వంటి మొక్కలు ఉన్నవి.. ఇవి ఎక్కువగా పల్లెటూర్లలో పొలాల గట్ల మధ్య కూడా పెరుగుతూ ఉంటాయి. ఇవి ఎక్కువగా నేల మీద పాకి పోతూ ఉంటాయి ఈ మొక్కలలో ఎక్కువగా నీటి శాతం కనిపిస్తుంది. పసుపు పచ్చని ఆకులు పూలు పూస్తాయి.. పుల్లగా ఉండేటువంటి ఈ ఆకుకూర తో పప్పు చేసుకుంటే తినడానికి రుచిగా ఉ న్నప్పటికీ.. ఎన్నో అద్భుతమైన పోషకాలు కలవు. ఈ పోషకాల గురించి తెలుసుకున్న తర్వాత వీటిని అసలు వదిలిపెట్టరు.. ఈ గంగ పాయల ఆకుల విటమిన్..A,B,C,D వంటి వాటితో పాటు మాంగనీస్, మెగ్నీషియం, పొటాషియం, కాల్షియం ,ఐరన్ వంటివి పుష్కలంగా లభిస్తాయి. ముఖ్యంగా చాలా తక్కువ క్యాలరీలు కలిగిన పీచు పదార్థాలు కూడా ఇందులో ఉంటాయి.

## పురుషులకు బలం కోసం వాల్‌నట్స్...!



ఆరోగ్యమే మహా బలం. ప్రస్తుత జీవనశైలి వల్ల అనారోగ్య సమస్యలు ఎక్కువ అవుతున్నాయి. అంతే కాదు జీవిత కాలం కూడా మరింత తగ్గింది. అందుకే ఫుడ్ విషయంలో జాగ్రత్త తీసుకోవాలి అంటారు వైద్యులు.ఆహారం వల్ల మన ఆరోగ్యం ముడిపడి ఉంటుంది. పోషకాహారం వల్ల శరీరానికి ఎలాంటి అనారోగ్య సమస్యలు దరిచేరవు. అంతేకాదు విటమిన్లు, ప్రోటీన్లు ఉన్న ఫుడ్ ను కూడా తీసుకోవాల్సిందే. అయితే కాస్త ధర ఎక్కువ అయినా కూడా పిస్తా తింటారు చాలా మంది మరి దీని వల్ల ప్రయోజనాలు ఏంటో తెలుసా?పిస్తా అనేది డ్రై నట్ అనే విషయం తెలిసిందే. ఇది శరీరానికి ఇన్ఫెక్షన్ ల నుంచి రక్షిస్తుంది.ఇందులో ఫైబర్, కార్బోహైడ్రేట్స్, అమైనో ఆమ్లాలు, విటమిన్ ఏ,కె, సి, బి-6, డి, ఇ లు పుష్కలంగా ఉంటాయి. మిగతా వాటికంటే ఇందులోనే అధిక ప్రోటీన్లు ఉంటాయయట. అందుకే ఈ పిస్తాను రోజు తీసుకోవడం వల్ల అధిక రక్తపోటు నుంచి తప్పించుకోవచ్చు. కొలెస్ట్రాల్, ఊబకాయం కూడా అదుపులో ఉ ంటాయి.సాయంత్రం వేల కొన్ని పిస్తా గింజలు తింటే పురుషులకు శృంగార శక్తి మరింత పెరుగుతుంది అంటున్నారు నిపుణులు.ఎముకల్లో పటుత్వం తక్కువ ఉ న్నవారు ప్రతి రోజు రాత్రి మరవకుండా పిస్తాలను తింటే మంచి ఫలితాలు వస్తాయి.అంతేకాదు రక్తంలోని చక్కెరను నియంత్రిస్తుంది పిస్తా. పిస్తా లో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు కంటికి ఎంతో మేలు చేస్తాయట. రోజు 5 పిస్తాలను తినడం వల్ల జ్ఞాపకశక్తి మరింత పెరుగుతుందట. అంతేకాదు దీని వల్ల అలసటకు చెక్ పెట్టవచ్చు.మంచి బలం కూడా చేకూరుతుంది. క్రమం తప్పకుండా పిస్తాను డైట్ లో చేర్చుకుంటే అధిక బరువు నుంచి కూడా ఉపశమనం పొందవచ్చు.ఇది నైట్రిక్ ఆక్సైడ్ మారినప్పుడు రక్తనాళాలను విస్తృతం చేస్తుంది.

## మట్టి కుండలో నీరు తాగడం వలన కలిగే ప్రయోజనాలు



సమ్మర్ వచ్చిదంటే చాలు చాలా మంది ఫ్రిజ్‌లో వాటర్ తాగడానికి ఎక్కువ ఆసక్తి చూపుతుంటారు. చాలా చల్లగా వాటర్ తాగుతూ అనేక అనారోగ్య సమస్యలు తెచ్చుకుంటారు. అయితే వేసవిలో ఫ్రిజ్‌లోని వాటర్ కంటే, మట్టికుండలోని నీరు తాగడం ఆరోగ్యానికి చాలా మంచిది అంటున్నారు నిపుణులు. ఒకప్పుడు పల్లెల్లో ఎక్కడ చూసినా ఇంటి ఇంటికి ఓ కుండ ఉండేది. కానీ ఇప్పుడు ఇంటికొక ఫ్రిజ్ ఉంటుంది. అయితే ఫ్రిజ్ కొనుగోలు చేసే స్తోమత లేని వారు మాత్రం ఇప్పటికీ మట్టి కుండలో నీరే తాగుతున్నారు. మరికొందరు ఫ్రిజ్ ఉన్నా కుండలో వాటర్ ఆరోగ్యానికి మంచిదని మట్టి కుండలోని నీరు తాగుతుంటారు. కాగా, మట్టి కుండలోని నీరు తాగడం వలన కలిగే ప్రయోజనాలు ఏవో ఇప్పుడు చూద్దాం. కుండలో నీరు సహజంగానే చల్లగా ఉ ండటమే కాకుండా రుచిగా ఉంటాయి. వేసవిలో గ్యాస్ అసిడిటీ లాంటి సమస్యలు ఇబ్బంది పెడతాయి. అయితే కుండ నీరు తాగడం వలన వాటి నుంచి విముక్తి పొందవచ్చును. అలాగే శ్వాస కోశ సమస్యల నుంచి ఉపశమనం పొందవచ్చు. ఇక వేసవిలో చాలా మంది డీహైడ్రేషన్ బారిన పడుతుంటారు.

# అనౌన్స్‌మెంట్ ఇదిగో..





రామ్ చరణ్-సుకుమార్ కాంబోలో రాబోతున్న కొత్త సినిమాను అఫీషియల్‌గా అనౌన్స్ చేశారు. ఎవరూ ఊహించని విధంగా హోలీ రోజున ఫ్యాన్స్‌కి సర్‌ప్రైజ్ ఇచ్చారు. మెగా పవర్‌స్టార్ రామ్ చరణ్ పుట్టినరోజు నాడు ఓ భారీ సర్‌ప్రైజ్ ఉంటుందని ఫ్యాన్స్ అంతా ఊహించారు. కానీ వాళ్ల అంచనాలను తలకిందులు చేస్తూ హోలీ రోజునే సర్‌ప్రైజ్ ఇచ్చారు రామ్ చరణ్. మైత్రీ మూవీ మేకర్స్ ఈరోజు ఓ కీలక ప్రకటన చేసింది. రామ్ చరణ్- సుకుమార్ కాంబోలో RC 17 (వర్కింగ్ టైటిల్) రాబోతుందంటూ ప్రకటించారు. వీళ్ల కాంబోలో వచ్చిన రంగస్థలం భారీ బ్లాక్ బస్టర్ అయిన సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా రామ్ చరణ్-సుకుమార్ హోలీ సెలబ్రెట్ చేస్తున్న ఫొటోను షేర్ చేసింది మైత్రి మూవీ మేకర్స్. దీంతో పాటు రెండు గుర్రాలు ఉన్న ఓ ఫొటోను షేర్ చేస్తూ Raring2Conquer అనే హ్యాష్‌ట్యాగ్‌ను పెట్టారు. ఇక ఈ సినిమాను సుకుమార్ రైటింగ్స్ బ్యానర్‌తో కలిసి మైత్రి మూవీ మేకర్స్ సంయుక్తంగా నిర్మించబోతుంది. అలానే ఈ చిత్రానికి దేవి శ్రీ ప్రసాద్ సంగీతం ఇవ్వబోతున్నారు. ఇలా రంగస్థలం టీమ్ మొత్తం మరోసారి కలిసిందంటూ ఫ్యాన్స్ ఉత్సాహంగా ఉన్నారు. ప్రస్తుతం RC 17 హ్యాష్ ట్యాగ్ ట్రెండింగ్‌లో ఉంది. ఈ పాన్-ఇండియన్ సినిమా గురించి మరిన్ని అప్‌డేట్స్ త్వరలోనే ప్రకటించనున్నారు. గేమ్ ఛేంజర్-పుష్ప 2ఇక ప్రస్తుతం రామ్ చరణ్ గేమ్ ఛేంజర్ షూటింగ్‌తో బిజీగా ఉన్నారు. ఈ షూటింగ్‌ను వీలైనంత త్వరగా ముగించుకొని ఆర్‌సీ 16 షెడ్యూల్ మొదలుపెట్టాలని చెర్రీ అనుకుంటున్నారు. బుచ్చి బాబుతో చేస్తున్న ఈ సినిమాలో జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటిస్తుంది. పూజా కార్యక్రమాలతో ఇటీవల గ్రాండ్‌గా ఈ సినిమాను లాంఛ్ చేశారు. ఇక తన పుట్టిన రోజు అయిన మార్చి 27న గేమ్ ఛేంజర్ నుంచి జరగండి సాంగ్‌ను రిలీజ్ చేయబోతున్నారు. మరోవైపు సుకుమార్ పుష్ప 2 సినిమాతో బిజీగా ఉన్నారు. ఇటీవలే ఈ చిత్రం లాస్ట్ షెడ్యూల్ వైజాగ్, హైదరాబాద్‌లో ముగిసింది. ఇక పోస్ట్ ప్రొడక్షన్ పనులు మొదలుపెట్టబోతున్నారు. వీలైనంత త్వరగా వీటిని ముగించుకొని ఆగస్టు 15న సినిమా రిలీజ్ చేయాల్సి ఉంది. పుష్ప సినిమాతో పాన్ ఇండియా లెవల్లో బ్లాక్ బస్టర్ అందుకున్నారు సుకుమార్. బన్నీకి భారీ హిట్ ఇచ్చి ఇప్పుడు పుష్ప 2 చిత్రాన్ని తీశారు. దీంతో సుకుమార్ క్రేజ్ మరింత పెరిగిపోయింది. పుష్ప 2 రిలీజ్ అయిన తర్వాత RC 17 షూటింగ్ మొదలయ్యే అవకాశం ఉంది. ఎలాగైనా 2025 చివరి నాటికి RC 17ను రిలీజ్ చేయాలని మేకర్స్ ప్లాన్ చేస్తున్నారట. మరి అనుకున్నట్లు అవుతుందో లేదో చూడాలి.


# నా సినిమా రీమేక్ చేశారని నాకే తెలీదు..



మలయాళంలో స్టార్ హీరో అయిన పృథ్వీరాజ్ సుకుమారన్ తెలుగు ఆడియన్స్‌కి 'సలార్' సినిమాతో బాగా దగ్గరయ్యారు. ఈ చిత్రంలో ప్రభాస్ స్నేహితుడైన వరదరాజ మన్నార్ పాత్రలో అద్భుతంగా నటించారు. ప్రస్తుతం తన కొత్త చిత్రం 'ఆడుజీవితం' (ది గోట్ లైఫ్) ప్రమోషన్స్‌లో బిజీగా ఉన్నారు పృథ్వీరాజ్. ఇందులో భాగంగా హైదరాబాద్‌లో కూడా పలు ఇంటర్వ్యూలు ఇస్తున్నారు. ఈ సందర్భంగా ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో రీమేక్ సినిమాలపై ఇంట్రెస్టింగ్ కామెంట్స్ చేశారు.

నాకే తెలీదు... పృథ్వీరాజ్ సినిమాలైన అయ్యప్పన్ కోషియమ్, లూసిఫర్, ముంబై పోలీస్‌లను తెలుగులో కూడా రీమేక్ చేసిన సంగతి తెలిసిందే. ఈ మూడు చిత్రాలను భీమ్లా నాయక్, గాడ్ ఫాదర్, హంట్ పేర్లతో తెలుగులో రీమేక్ చేశారు. ఈ చిత్రాలను మీరు చూశారా అని అడిగిన ప్రశ్నకి లేదు అంటూ పృథ్వీరాజ్ బదులిచ్చారు. "నేను నటించిన ముంబై పోలీస్ తెలుగులో రీమేక్ చేశారని నాకు అసలు తెలీదు. ఇక భీమ్లా నాయక్ సినిమా నేను చూడలేదు.. అయితే కొన్ని సీన్లు మాత్రం చూశాను. అలానే గాడ్ ఫాదర్‌లో కొన్న సీక్వెన్స్‌లు కూడా చూశాను. అయితే ఈ రెండు చిత్రాలు చూసే టైమ్ నాకు దొరకలేదు.. ఆ సమయంలో వేరే ఒక సినిమాను డైరెక్ట్ చేస్తున్నాను. అయితే కొద్ది రోజుల్లో మనం ఇక రీమేక్ సినిమాలు చేసే అవసరం కూడా ఉండదు. ఎందుకంటే ఉదాహరణకి ఆడుజీవితం సినిమా అన్ని భాషల్లోనూ రిలీజ్ అవుతుంది. కనుక ఇక మళ్లీ దీన్ని తెలుగులో తీయాల్సిన అవసరం లేదు కదా. భవిష్యత్తులో ఇక అన్ని చిత్రాలు అన్ని భాషల్లోనూ రిలీజ్ అవుతాయి. అందుకే రీమేక్‌లు ఇక ఉండవ్." అంటూ పృథ్వీరాజ్ చెప్పుకొచ్చారు. ఇక పృథ్వీరాజ్ డైరెక్ట్ చేసిన లూసిఫర్ సినిమా మలయాళంలో బ్లాక్ బస్టర్ అయింది. మోహన్ లాల్ నటించిన ఈ సినిమా రైట్స్‌ను తీసుకొని గాడ్ ఫాదర్ అంటూ తెలుగులో చిరంజీవి నటించిన సంగతి తెలిసిందే. ఈ సినిమాను తెలుగులోనూ డైరెక్ట్ చేయాలని పృథ్వీరాజ్‌ను చిరంజీవి కోరారు. అయితే అప్పటికి ఆడుజీవితం సినిమా షూటింగ్‌లో బిజీగా ఉండటంతో ఆ ఆఫర్‌ను పృథ్వీరాజ్ తిరస్కరించారు. ఇక ఆడుజీవితం విషయానికొస్తే ఈ సినిమా షూటింగ్ దాదాపు పూర్తిగా ఎడారిలోనే జరిగింది. బతుకు తెరువు కోసం దుబాయ్ వెళ్లిన ఓ కేరళ యువకుడు అక్కడి ఎడారిలో చిక్కుకుపోతాడు. అక్కడ అతను పడిన బాధలు, అనుభవించిన వేదన, తిరిగి మాతృభూమికి వచ్చిన ప్రయాణం నేపథ్యంలో ఈ సినిమాను తీశారు. వాస్తవిక సంఘటన ఆధారంగా ఈ చిత్రాన్ని రూపొందించారు.

# అర్జెంట్‌గా దుబాయ్..




అల్లు అర్జున్ తన ఫ్యామిలీతో కలిసి సడెన్‌గా దుబాయ్ వెళ్లారు. పుష్ప 2 షూటింగ్ ముగించుకొని బన్నీ ఇంత సడెన్‌గా ఎందుకు వెళ్లారో అంటూ కొంతమంది ఫ్యాన్స్ ఆలోచిస్తున్నారు. ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ ఇటీవలే వైజాగ్, హైదరాబాద్‌లో పుష్ప 2 షూటింగ్ షెడ్యూల్‌ను ముగించారు. ప్రస్తుతం ఖాళీగానే ఉండటంతో ఈ రోజు తన భార్య అల్లు స్నేహ రెడ్డి, పిల్లలు అయాన్, అర్హలతో కలిసి దుబాయ్ వెళ్లారు అల్లు అర్జున్. అయితే ఇది వెకేషన్ కోసం వెళ్లిన టూర్ కాదట. మరి బన్నీ ఎందుకు వెళ్లారంటే?

మైనపు విగ్రహం.... దుబాయ్‌లోని మేడమ్ టుస్సాడ్స్ మ్యూజియంలో అల్లు అర్జున్ మైనపు విగ్రహాన్ని ఆవిష్కరించబోతున్నారు. ఈ ఈవెంట్?కి హాజరయ్యేందుకే బన్నీ ఫ్యామిలీతో పాటు దుబాయ్ వెళ్లారు. పుష్ప సినిమాతో ఇంటర్నేషనల్ లెవెల్‌లో పేరు తెచ్చుకున్న బన్నీ విగ్రహాన్ని ప్రఖ్యాత మేడమ్ టుస్సాడ్స్ మ్యూజియంలో ఏర్పాటు చేయడంపై ఆయన ఫ్యాన్స్ ఫుల్ హ్యాపీగా ఉన్నారు. ఆ మైనపు విగ్రహం కోసం అల్లు అర్జున్ గత ఏడాది అక్టోబర్‌లో తన కొలతలు ఇచ్చి వచ్చారు. మార్చి 28న ఈ విగ్రహాన్ని ఆవిష్కరించబోతున్నారు. మార్చి 28 రాత్రి 8 గంటలకి ఈ కార్యక్రమం జరగబోతుంది. ఇప్పటికే మేడమ్ టుస్సాడ్స్ మ్యూజియంలో తెలుగు హీరోలు ప్రభాస్, మహేష్ బాబు మైనపు విగ్రహాలు ఏర్పాటు చేశారు. కానీ ఇవి లండన్‌లోని మ్యూజియంలో ఉన్నాయి. అయితే అల్లు అర్జున్‌ది మాత్రం దుబాయ్ మ్యూజియంలో ఏర్పాటు చేస్తున్నారు. ఇక్కడ మ్యూజియంలో ఏర్పాటు చేస్తున్న తొలి ఇండియన్ యాక్టర్ విగ్రహం అల్లు అర్జున్‌దే కావడం విశేషం. అయితే ఈ విగ్రహం ఎలా ఉండబోతుందోనని బన్నీ ఫ్యాన్స్ ఆత్రుతగా ఎదురుచూస్తున్నారు. పుష్ప సినిమాలో తగ్గేదేలే అంటూ అల్లు అర్జున్ చేసిన మేనరిజంతో ఉంటుందేమోనని అంతా అనుకుంటున్నారు. అయితే అల వైకుంఠపురంలో రెడ్ జాకెట్ వేసుకున్న స్టైయిల్లో ఉంటుందని మరికొంతమంది అంటున్నారు. మరి విగ్రహం ఎలా ఉంటుందో చూడాలి. ఇక కెరీర్ విషయానికొస్తే అల్లు అర్జున్ ఫోకస్ మొత్తం ప్రస్తుతం పుష్ప 2పైనే ఉంది. వీలైనంత త్వరగా పుష్ప 2 పోస్ట్ ప్రొడక్షన్ పనులు పూర్తి చేసుకొని సినిమాను ముందు ప్రకటించినట్లు ఆగస్టు 15న రిలీజ్ చేయాలని బన్నీ ప్లాన్ చేస్తున్నాడు. పాన్ ఇండియా లెవల్లో ఈ సినిమా గురించి అందరూ ఎదురుచూస్తున్నారు. ఇక ఇది పూర్తయిన తర్వాత సందీప్ రెడ్డి వంగా, త్రివిక్రమ్ శ్రీనివాస్‌లతో కూడా ప్రాజెక్టులు చేయాల్సి ఉంది. అయితే తమిళ డైరెక్టర్ అట్లీతో కూడా బన్నీ ఓ సినిమా ప్లాన్ చేస్తున్నాడు. మరి ఇందులో ఏది ముందు అవుతుందో చూడాలి. మేక్సిమమ్ అట్లీ సినిమానే బన్నీ అనౌన్స్ చేసే అవకాశం ఉంది.



# హోలీ సెలబ్రేషన్‌లో

విజయ్ దేవరకొండ- మృణాల్ ఠాకూర్ హోలీ సెలబ్రేషన్స్‌లో పాల్గొన్నారు. నిర్మాత దిల్ రాజు ఏర్పాటు చేసిన ఈ ఈవెంట్‌లో ఫ్యామిలీ స్టార్ మూవీ టీమ్ పాల్గొంది. ఫ్యాన్స్ మధ్యలో హోలీ సెలబ్రేట్ చేసుకున్న తర్వాత ఫ్యామిలీ స్టార్ సినిమా నుంచి థర్డ్ సింగిల్‌ను రిలీజ్ చేశారు. 'మధురము కదా..' అంటూ సాగే ఈ పాట ఫ్యాన్స్‌ను విపరీతంగా ఆకట్టుకుంటుంది. సాంగ్‌లో విజయ్-మృణాల్ చాలా అందంగా కనిపించారు. లవ్ సాంగ్.... విజయ్, మృణాల్ మధ్య ప్రేమను తెలియజేసే విధంగా ఈ సాంగ్ ఉంది. ఈ పాటకి శ్రీమణి లిరిక్స్ కూడా ఆకట్టుకుంటున్నాయి. ఇక శ్రేయా ఘోషల్ ఈ పాటను తనదైన స్టైల్?లో ఆలపించారు. ఇప్పటికే ఫ్యామిలీ స్టార్ నుంచి వచ్చిన రెండు సాంగ్స్ బ్లాక్ బస్టర్ అయ్యాయి. ఫస్ట్ సింగిల్ 'నందనందనా', సెకండ్ సింగిల్ 'కళ్యాణి వచ్చా వచ్చా.' పాటలు వైరల్ అవుతున్నాయి. ఇప్పుడు థర్డ్ సింగిల్‌కి కూడా మంచి రెస్పాన్స్ వస్తుంది. ఈ సినిమాకి మ్యూజిక్ డైరెక్టర్ గోపీ సుందర్ సంగీతం అందించారు. ఇక ఫ్యామిలీ స్టార్ సినిమా ట్రైలర్‌ను ఈ నెల 28న రిలీజ్ చేయబోతున్నారు. శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్‌లో దిల్ రాజు, శిరీష్ ఈ సినిమాను నిర్మించారు. పరశురామ్ ఈ చిత్రానికి దర్శకత్వం వహించారు. ఏప్రిల్ 5న తెలుగు, తమిళ, హిందీ భాషల్లో ఈ సినిమా రిలీజ్ కాబోతుంది.



# కల్కి గురించి కమల్ హాసన్..







ప్రభాస్ ప్రధాన పాత్రలో నటిస్తున్న కల్కి 2898 ఏడీ సినిమా మే 9న రిలీజ్ కాబోతుంది. అయితే తాజాగా ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో కమల్ హాసన్ ఈ సినిమాపై ఇంట్రెస్టింగ్ కామెంట్స్ చేశారు. ప్రభాస్ నటిస్తున్న 'కల్కి 2898 సినిమాను అత్యంత ప్రతిష్టాత్మకంగా తెరకెక్కిస్తున్నారు. మహానటి డైరెక్టర్ నాగ్ అశ్విన్ ఈ సినిమాకి దర్శకత్వం వహిస్తున్నారు. ఇటీవల కల్కి టీమ్ ఇటలీలో ఓ షూటింగ్ షెడ్యూల్ ముగించింది. ప్రభాస్-దిశా పటానిపై ఓ రొమాంటిక్ సాంగ్‌ను చిత్రీకరించారు. ఇక ఈ చిత్రంలో కమల్ హాసన్ కూడా నటిస్తున్న సంగతి తెలిసిందే. అయితే తాజాగా ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో ఈ సినిమాపై ఇంట్రెస్టింగ్ కామెంట్స్ చేశారు కమల్ హాసన్.

నా రోల్ ఇదే... ఈ భారీ బడ్జెట్ సినిమాలో తాను అతిథి పాత్రలో మాత్రమే నటిస్తున్నట్లు ఓ ఇంటర్వ్యూలో కమల్ క్లారిటీ ఇచ్చారు. అయితే చాలా మంది కమల్ ఈ సినిమాలో విలన్ పాత్రలో నటిస్తున్నారని ఊహించారు. కానీ వారందరికీ షాకిస్తూ కమల్ తాను గెస్ట్ రోల్ మాత్రమే చేస్తున్నానని చెప్పారు. అయితే ఇది విక్రమ్ సినిమాలో చివరిలో వచ్చే రోలెక్స్ పాత్రలా ఉంటుందేమో అంటూ ఫ్యాన్స్ ఆశిస్తున్నారు. ఎందుకంటే విక్రమ్‌లో సూర్య చేసిన ఈ రోలెక్స్ పాత్ర కేవలం 5 నిమిషాలే ఉన్నా ఫ్యాన్స్‌కి మాత్రం తెగ నచ్చేసింది. తర్వాత పార్ట్‌పై భారీ అంచనాలు పెంచేలా చేసింది రోలెక్స్ క్యారెక్టర్. ఇక కమల్ పాత్ర కూడా అలానే ఉంటుందేమో అని ఆయన ఫ్యాన్స్ అనుకుంటున్నారు. ఇక ఈ చిత్రంలో అమితాబ్ బచ్చన్ మరో కీలక పాత్రలో నటిస్తున్నారు. దీపికా పదుకొణె హీరోయిన్‌గా నటిస్తుంది. ఇక దిశా పటానీ కూడా మరో కీలక రోల్‌లో కనిపిస్తుంది. అయితే తెలుగు రాష్ట్రాల్లో ఎన్నికల కారణంగా కల్కి సినిమా వాయిదా పడే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. కానీ మూవీ టీమ్ మాత్రం ఇప్పటివరకూ సినిమా రిలీజ్ వాయిదాపై ఎలాంటి అప్‌డేట్ ఇవ్వలేదు. మరి చిత్రాన్ని వాయిదా వేస్తారో లేక అనుకున్నట్లుగా మే 9న రిలీజ్ చేస్తారో చూడాలి. ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్‌ని అశ్విని దత్ నిర్మిస్తున్నారు. సంతోష్ నారాయణన్ మ్యూజిక్ అందిస్తున్నారు. ఇక కల్కితో పాటు ప్రభాస్ చేతిలో మరో రెండు సినిమాలు ఉన్నాయి. అందులో ఒకటి మారుతి డైరెక్షన్‌లో ది రాజా సాబ్ కాగా మరొకటి ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో రాబోతున్న సలార్ పార్ట్ 2. ఇందులో సలార్ 2పై భారీ అంచనాలు ఉన్నాయి. సలార్ పార్ట్ 1 గతేడాది రిలీజై మంచి వసూళ్లు సాధించింది. ప్రభాస్‌ను మళ్లీ హిట్ ట్రాక్ ఎక్కించింది. దీంతో సలార్ 2 కోసం రెబల్ ఫ్యాన్స్ ఎదురుచూస్తున్నారు.

# నమ్మలేని నిజం





టాలీవుడ్ జక్కన్న రాజమౌళి దర్శకత్వంలో మహేష్ బాబు హీరోగా ఒక సినిమా రూపొందబోతుంది. టాలీవుడ్ జక్కన్న రాజమౌళి దర్శకత్వంలో మహేష్ బాబు హీరోగా ఒక సినిమా రూపొందబోతుంది. అందుకు సంబంధించిన ప్రీ ప్రొడక్షన్ వర్క్ జరుగుతున్నట్లుగా ఇటీవలే రాజమౌళి ఒక కార్యక్రమంలో అధికారికంగా ప్రకటించాడు. ఇప్పటి వరకు హీరో తప్ప మరే నటుడిని ఎంపిక చేయలేదని కూడా జక్కన్న చెప్పుకొచ్చాడు. సోషల్ మీడియా మరియు మెయిన్ స్ట్రీమ్ మీడియాలో మాత్రం రకరకాలుగా ప్రచారం జరుగుతూనే ఉంది. హాలీవుడ్ నటుడు ఈ సినిమాలో నటించబోతున్నట్లు గతంలో వార్తలు వచ్చాయి. ఇప్పుడు బాలీవుడ్ హీరోయిన్ ఆలియా భట్ ఈ సినిమాలో నటించబోతుందనే వార్తలు వస్తున్నాయి. రాజమౌళి గత చిత్రం ఆర్ఆర్ఆర్ లో హీరోయిన్ గా ఆలియా భట్ నటించిన విషయం తెల్సిందే. ఆ సినిమా లో ఆలియా పాత్ర గురించి అంత ఇంత అంటూ ప్రచారం చేశారు. కానీ అందులో ఆలియా పాత్ర మరీ నిరాశాజనకంగా ఉంది. రాజమౌళి పై ఆలియా చాలా కోపంగా ఉందనే వార్తలు కూడా వచ్చాయి. ఆర్ఆర్ఆర్ సినిమాలో తనకు ఏమాత్రం ప్రాముఖ్యత ఉన్న పాత్రను ఇవ్వని రాజమౌళి సినిమాలో ఆలియా నటించేందుకు ఒప్పుకుంటుందా అంటే కచ్చితంగా లేదు అనే సమాధానం వస్తుంది. కానీ కొందరు బాలీవుడ్ వర్గాల వారు మాత్రం ఈసారి ఆలియా ను తీసుకుని ప్రాముఖ్యత ఉన్న పాత్రను ఇవ్వాలని జక్కన్న భావిస్తున్నాడనే వార్తలు వస్తున్నాయి. ఇప్పటి వరకు రాజమౌళి నుంచి ఈ విషయమై ఎలాంటి స్పష్టత రాలేదు.

# కాస్త రిస్కేమో టిల్లు



డీజే టిల్లుకి సీక్వెల్ గా సిద్ధమైన టిల్లు స్క్వేర్ మూవీతో మరో బ్లాక్ బస్టర్ హిట్ ని ఖాతాలో వేసుకోవాలని సిద్దు జొన్నలగడ్డ గట్టి ప్రయత్నం చేస్తున్నారు డీజే టిల్లుకి సీక్వెల్ గా సిద్ధమైన టిల్లు స్క్వేర్ మూవీతో మరో బ్లాక్ బస్టర్ హిట్ ని ఖాతాలో వేసుకోవాలని సిద్దు జొన్నలగడ్డ గట్టి ప్రయత్నం చేస్తున్నారు. మార్చి 29న ప్రపంచ వ్యాప్తంగా ఈ చిత్రం థియేటర్స్ లోకి రాబోతోంది. డీజే టిల్లు చిత్రాన్ని అవుట్ అండ్ అవుట్ కామెడీ ఎంటర్టైనర్ గా తెరకెక్కించి బ్లాక్ బస్టర్ హిట్ కొట్టారు. రాధిక క్యారెక్టర్ తో టిల్లు పండించిన వినోదానికి యూత్ బాగా కనెక్ట్ అయ్యారు. అయితే ఈ సారి రాధిక ప్లేస్ లోకి లిల్లీని సిద్దు తీసుకొచ్చాడు. లిల్లీగా అనుపమ పరమేశ్వరన్ బోల్డ్ అండ్ రొమాంటిక్ ఇంటిమెంట్ సన్నివేశాలతో దర్శనం ఇవ్వబోతోంది. ఆమె ఇలాంటి పాత్ర చేయడంతో టిల్లు స్క్వేర్ సినిమాకు కావల్సినంత బజ్ క్రియేట్ అవుతోంది. కంప్లీట్ గా యూత్ ఆడియన్స్ ని దృష్టిలో ఉంచుకొని ఈ చిత్రాన్ని రెడీ చేసినట్లు టీజర్ లో ఉన్న సన్నివేశాల బట్టి అర్ధమవుతోంది. రొమాంటిక్ కామెడీకి యూత్ నుంచి మంచి రెస్పాన్స్ ఉంటుంది. ముద్దుగుమ్మ అందాల కలర్ ఫుల్ హోళీ అందుకే డీజే టిల్లులో లేని మసాలాని టిల్లు స్క్వేర్ లో అదనంగా యాడ్ చేశారు. అనుపమ పరమేశ్వరన్ కూడా ఎలాంటి రెస్ట్రిక్షన్స్ లేకుండా సిద్దుతో ఇంటిమెంట్ సన్నివేశాలు చేసింది. ఆమె క్యారెక్టర్ రాధికని మించి ఉంటుందని అందరూ భావిస్తున్నారు. అయితే ఈ ఓవర్ మసాలా సన్నివేశాలు టిల్లు స్క్వేర్ కి మైనస్ అవుతాయేమో అనే అనుమానం కూడా కలుగుతోంది. ఇప్పుడు మూవీ రన్ టైం కూడా రిస్క్ ఫ్యాక్టర్ ని మరింత పెంచేలా ఉందనే మాట వినిపిస్తోంది. మూవీ 2 గంటల కంటే తక్కువ నిడివి మాత్రమే ఉంటుందంట. ఈ సినిమా రన్ టైంపై కూడా కొంతమంది అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. అయితే ఈ సినిమాకి కథని అందించింది సిద్దునే కాబట్టి కచ్చితంగా ప్రేక్షకులకి ఏం కావాలి. ఏ స్థాయిలో ఇవ్వాలనే దానిపై ఒక స్పష్టత ఉండొచ్చని అనుకుంటున్నారు. కాబట్టి అవసరమైన మేరకు 1 గంట 58 నిమిషాల నిడివితో సినిమా అవుట్ ఫుట్ రెడీ అయినట్లు టాక్. పర్ఫెక్ట్ సీన్స్ తో లెక్కల ప్రకారమే డీజే టిల్లులో మిస్ అయిన రొమాంటిక్ మసాలా సన్నివేశాలు టిల్లు స్క్వేర్ లో పెట్టారు. ఇవి సినిమాకి అవే అదనపు అస్సెట్ అవుతాయని భావిస్తున్నారు. వారి అంచనాలకి తగ్గట్లుగా రన్ టైం కానీ, రొమాంటిక్ సన్నివేశాలు కానీ సినిమాలు ప్లస్ అయితే ఒకే, లేదంటే సిద్దు పెద్ద రిస్క్ తీసుకున్నట్లు అవుతుందని సినీ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. చూడాలి మరి ఈసారి సిద్దు ప్లాన్ ఎలా వర్కౌట్ అవుతుందో.

# మార్చిలో భారీగా తగ్గనున్న పసిడి దిగుమతులు.....!




## ధరల పెరుగుదలే కారణం..!

ఫిబ్రవరితో పోలిస్తే మార్చిలో భారత దేశ బంగారం దిగుమతి 90శాతానికి తగ్గే అవకాశాలున్నాయి. కరోనా మహమ్మారి తర్వాత కనిష్ఠానికి చేరుతుందని.. అయితే, భారీగా ధరలు పెరుగుదల డిమాండ్‌ను భారీగా దెబ్బతీసిందని ఓ ప్రభుత్వ అధికారి తెలిపారు. ఫిబ్రవరితో పోలిస్తే మార్చిలో భారత దేశ బంగారం దిగుమతి 90శాతానికి తగ్గే అవకాశాలున్నాయి. కరోనా మహమ్మారి తర్వాత కనిష్ఠానికి చేరుతుందని.. అయితే, భారీగా ధరలు పెరుగుదల డిమాండ్‌ను భారీగా దెబ్బతీసిందని ఓ ప్రభుత్వ అధికారి తెలిపారు. దాంతో బ్యాంకులు బంగారం కొనుగోళ్లను తగ్గించడంతో దిగుమతుల్లో భారీగా తగ్గే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. ఫిబ్రవరిలో భారత్ 110 టన్నుల బంగారాన్ని దిగుమతి చేసుకుందని.. మార్చిలో 10-11 టన్నులకు పరిమితమయ్యే అవకాశం ఉందని పేర్కొన్నారు. ప్రపంచంలో బంగారాన్ని దిగుమతి చేసుకుంటున్న దేశాల్లో భారత్ రెండోస్థానంలో ఉన్నది. మార్చి నెల ప్రారంభంలో పసిడి ధర రికార్డు స్థాయికి చేరింది. దిగుమతుల తగ్గుదల భారత్ వాణిజ్య లోటును తగ్గించడానికి సహాయపడుతుందని, అలాగే రూపీకి సైతం మద్దతు లభించే అవకాశాలున్నాయని అధికారి చెప్పారు. రికార్డు స్థాయిలో అధిక ధరలకు దిగుమతి చేసుకుని డిమాండ్ పెరిగే వరకు వేచిచూడాల్సిన అవసరం లేకపోవడంతో నగల వ్యాపారులు 35 డాలర్ల కంటే ఎక్కువ డిస్కౌంట్లతో కూడా బంగారాన్ని కొనుగోలు చేయడం లేదు. అధిక ధరల కారణంగా వినియోగదారులు పాత బంగారు ఆభరణాల స్థానంలో కొత్త వాటితో భర్తీ చేస్తున్న నేపథ్యంలో నగల వ్యాపారులు బ్యాంకుల నుంచి బంగారం కొనడం మానేశారు. గ్లోబల్ మార్కెట్‌లో బంగారం పెరిగింది. క్రమంలో బుధవారం బులియన్ మార్కెట్‌లో బంగారం రూ.150 పెరిగి తులానికి రూ.67వేలకు చేరింది.


## స్పోర్టీ లుక్‌లో అదరగొడుతున్న కొత్త 'ప్లెజర్'.....



ద్విచక్ర వాహనాల మార్కెట్లో హీరో మోటోకార్ప్ నుంచి వచ్చే మోడళ్లకు మంచి డిమాండే ఉంటుంది. అది స్కూటర్ అయినా, బైక్ అయినా మంచి సేల్స్ రాబడతాయి. ముఖ్యంగా మహిళలు ఈ కంపెనీ స్కూటర్లను ఎక్కువగా వినియోగిస్తున్నారు. ముఖ్యంగా హీరో ప్లెజర్ స్కూటర్లు ఎక్కువగా అమ్ముడవుతున్నాయి. ఈ క్రమంలో హీరోమోటో కార్ప్ ఇప్పుడు ఆ హీరో ప్లెజర్ కు కొత్త వేరియంట్ ను తీసుకొచ్చింది. ఇటీవలే ప్లెజర్ ప్లస్ ఎక్స్‌టెక్ స్పోర్ట్స్ వేరియంట్‌తో తన స్కూటర్ లైనప్‌ను విస్తరించింది. రూ. 79,738 (ఎక్స్-షోరూమ్) ధరతో దీనిని లాంచ్ చేసింది. ఈ కొత్త స్కూటర్ స్టైల్, పెర్ఫార్మెన్స్, కనెక్టివిటీ ఫీచర్ల సమ్మేళనం కోసం వెతుకుతున్న రైడర్‌లకు బెస్ట్ చాయిస్ గా ఉంటుంది. ఈ నేపథ్యంలో ప్లెజర్ ప్లస్ ఎక్స్ టెక్ స్పోర్ట్స్ స్కూటర్ కు సంబంధించిన స్పెసిఫికేషన్లు, ఫీచర్లు, పనితీరు వంటి వివరాలతో పాటు ఇతర వేరియంట్‌ల కన్నా దీనిలో భిన్నంగా ఏమి ఉందో తెలుసుకుందాం.. హీరో ప్లెజర్ ప్లస్ ఎక్స్ టెక్ స్పోర్ట్స్ అద్భుతమైన ఆరెంజ్ హైలైట్‌లతో కూడిన వైబ్రెంట్ అబ్రాక్స్ ఆరెంజ్ బ్లూ కలర్ స్కీమ్‌ను కలిగి ఉంది. స్కూటర్ దాని సైడ్ ప్యానెల్స్, ఫ్రంట్, ఫ్రంట్ మడ్‌గార్డ్‌పై '18' నంబర్‌ను కలిగి ఉంది. ఇది స్కూటర్ రూపానికి స్పోర్టీ టచ్‌ని జోడిస్తుంది. రిమ్స్‌లో ఆరెంజ్ హైలైట్‌లు కూడా ఉన్నాయి. ఇది స్కూటర్ ఓవరాల్ లుక్ ని సుందరంగా కనిపించేలా చేస్తుంది. అదనంగా, మిర్రర్స్, గ్రాబ్ హ్యాండిల్స్ బాడీ కలర్‌లో ఉంటాయి. ప్లెజర్ ప్లస్ ఎక్స్ టెక్ స్పోర్ట్స్ స్కూటర్ స్పోర్టీ ఎక్స్‌టీరియర్ ఉన్నప్పటికీ దీనిలో స్టాండర్డ్ వెర్షన్‌లో ఉన్న కోర్ ఫీచర్లు, టెక్నాలజీని కొనసాగించారు. ఈ స్కూటర్ 10-అంగుళాల చక్రాలు, మెరుగైన స్థిరత్వం కోసం టెలిస్కోపిక్ ఫోర్క్‌లు, నమ్మకమైన స్టాపింగ్ పవర్ కోసం రెండు చివర్లలో డ్రమ్ బ్రేక్‌లను కలిగి ఉంటుంది. స్కూటర్ బ్లూటూత్ కనెక్టివిటీతో డిజిటల్ ఇన్‌స్ట్రుమెంట్ క్లస్టర్‌ను కలిగి ఉంటుంది. ఇది రైడర్‌లు ప్రయాణంలో కనెక్ట్ అయ్యేందుకు వీలు కల్పిస్తుంది.

## సోలార్ ప్యానెల్ తయారీ ఫ్యాక్టరీని ప్రారంభించిన లుమినస్ పవర్ టెక్నాలజీస్


**హైదరాబాద్ :** సస్టైనబిలిటీ అండ్ సౌరశక్తి ప్రయత్నాలను బలోపేతం చేయడంలో భారీ ముందడుగు వేస్తూ భారతదేశంలోని ప్రముఖ ఎనర్జీ సొల్యూషన్స్ కంపెనీ లుమినస్ పవర్ టెక్నాలజీస్ ఉత్తరాఖండ్‌లోని రుద్రాపూర్‌లో పరిశ్రమలోనే మొదటి సోలార్ ప్యానల్ ఫ్యాక్టరీని ప్రారంభించింది. సానుకూల మార్పు కోసం ఉత్ప్రేరకం కావడానికి తోడ్పడుతూ ప్రతిష్టాత్మక పిఎం సూర్యోదయ యోజన ప్రారంభోత్సవం సందర్భంగా ప్రధానమంత్రి వివరించిన విధంగా దేశం సోలార్ విజన్, సుస్థిరత లక్ష్యాలతో ఈ ప్రయత్నం సమలేఖనం చేయబడింది. ఈసందర్భంగా లుమినస్ పవర్ టెక్నాలజీస్ ఎండి అండ్ సీఈఓ ప్రీతి బజాజ్ మాట్లాడుతూ.. రుద్రపూర్‌లోని గ్రీన్ సోలార్ ప్యానెల్ ఫ్యాక్టరీ భారతదేశం నెట్-జీరో మార్గంలో పెద్ద పాత్ర పోషించే దిశగా లుమినస్ వేసిన ఒక ముందడుగన్నారు. ఈ కొత్త ఉత్పాదక సదుపాయంలో తమ పెట్టుబడి సస్టైనబుల్ పద్ధతులను ప్రోత్సహించడంలో, కార్బన్ పాదముద్రను తగ్గించడంలో తమ అచంచలమైన అంకితభావాన్ని నొక్కి చెబుతుందన్నారు. సోలార్




తమ వ్యాపారంలో ముఖ్యమైన భాగంగా ఉంటుందన్నారు. ష్నైడర్ ఎలక్ట్రిక్, ఎగ్జిక్యూటివ్ విపి- ఇంటర్నేషనల్ ఆపరేషన్స్ అండ్ లుమినస్ బోర్డ్ చైర్మన్ మనీష్ పంత్ మాట్లాడుతూ.. ఇటీవలి సంవత్సరాలలో సౌర విద్యుత్ సామర్థ్యం అభివృద్ధిలో భారతదేశం అద్భుతమైన పురోగతిని సాధించిందన్నారు.


## అదానీ పవర్ ప్రాజెక్ట్‌లో రిలయన్స్‌కు 26 శాతం వాటా





ల ముఖేష్ అంబానీకి చెందిన రిలయన్స్ ఇండస్ట్రీస్.. అదానీ ప్రాజెక్ట్? మధ్యప్రదేశ్ పవర్‌లో 26 శాతం వాటాను కైవసం చేసుకుంది. ఈ ప్లాంటు నుంచి 500 మెగావాట్ల కరెంటును వాడుకోవడానికి ఒక ఒప్పందంపై సంతకం చేసింది. అదానీ పవర్ లిమిటెడ్‌కు చెందిన పూర్తి అనుబంధ సంస్థ అయిన మహాన్ ఎనర్జెన్ లిమిటెడ్‌లో రిలయన్స్ 5 కోట్ల ఈక్విటీ షేర్లను 10 రూపాయల ముఖ విలువతో (రూ. 50 కోట్లు) తీసుకుంటుంది. గుజరాత్‌కు చెందిన ఈ ఇద్దరు వ్యాపారవేత్తలు తరచూ వార్తల్లో నిలుస్తుంటారు. ఆసియాలోనే అత్యంత ధనికుడిగా మారేందుకు పోటీపడుతున్నారు. అంబానీకి చమురు, గ్యాస్, రిటైల్, టెలికాం వ్యాపారాలు ఉన్నాయి. అదానీకి విమానాశ్రయాలు, బొగ్గు, మైనింగ్, క్లీన్ ఎనర్జీ, సిమెంట్?వ్యాపారాలు ఉన్నాయి.

## భారీగా పెరిగిన ఇండ్ల అమ్మకాలు...!



**న్యూఢిల్లీ :** హైదరాబాద్‌సహా దేశంలోని 7 ప్రధాన నగరాల్లో ఈ జనవరి-మార్చిలో జరిగిన ఇండ్ల అమ్మకాలపై ప్రముఖ రియల్ ఎస్టేట్ కన్సల్టెంట్ అనరాక్ బుధవారం ఓ నివేదికను విడుదల చేసింది. హైదరాబాద్, ఢిల్లీ-ఎన్‌సీఆర్, ముంబై-ఎంఎంఆర్, పుణె, బెంగళూరు, చెన్నై, కోల్‌కతా హౌజింగ్ సేల్స్‌పై ఈ రిపోర్టు వచ్చింది. అయితే ఓవరాల్‌గా గతంతో పోల్చితే 14 శాతం వృద్ధి కనిపించినా.. ఈ ఏడు నగరాల్లో ఢిల్లీ-ఎన్‌సీఆర్, కోల్‌కతా, చెన్నైల్లో సేల్స్ పడిపోయినట్టు తేలింది. కాగా, ఈసారి ఈ 7 నగరాల్లో 1,30,170 ఇండ్లు అమ్ముడయ్యాయి. నిరుడు ఇదే వ్యవధిలో 1,13,775 యూనిట్లుగానే ఉన్నాయి. తాజా రిపోర్టులో గతంతో పోల్చితే హైదరాబాద్‌లోనే ఇండ్ల అమ్మకాలు అత్యధికంగా పెరిగినట్టు తేలింది. నిరుడు జనవరి-మార్చిలో 14,280 యూనిట్లు అమ్ముడైతే.. ఈ ఏడాది జనవరి-మార్చిలో 19,660 యూనిట్ల విక్రయాలు జరిగాయి. ఫలితంగా 38 శాతం వృద్ధి నమోదైంది. ఆ తర్వాత ముంబై-ఎంఎంఆర్‌లో సేల్స్ ఎక్కువగా పెరిగాయి. 24 శాతం వృద్ధితో 34,690 యూనిట్ల నుంచి 42,920 యూనిట్లకు ఎగిశాయి. పుణేలోనూ 15 శాతం ఎగబాకి 19,920 యూనిట్ల నుంచి 22,990 యూనిట్లకు పెరిగాయి. ఇక బెంగళూరులో 14 శాతం వృద్ధి కనిపించింది. 15,660 యూనిట్ల నుంచి 17,790 యూనిట్లకు చేరాయి. అయితే ఢిల్లీ-ఎన్‌సీఆర్‌లో 9 శాతం పతనమై 17,160 యూనిట్ల నుంచి 15,650 యూనిట్లకు పరిమితమయ్యాయి.

## వచ్చే ఆర్థిక సంవత్సరంలో ఔషధ రంగ వృద్ధి 8-10%



**న్యూఢిల్లీ :** వచ్చే ఆర్థిక సంవత్సరంలో, 25 దేశీయ ఫార్మా కంపెనీల ఆదాయాల్లో వృద్ధి 8- 10 శాతానికి మించకపోవచ్చని రేటింగ్ సేవల సంస్థ ఇక్రా లిమిటెడ్ అంచనా వేసింది. ఈ 25 కంపెనీలకు దేశీయ ఫార్మా పరిశ్రమలో 60% వాటా ఉంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఈ సంస్థలు 13- 14% వృద్ధి నమోదు చేశాయి. దీంతో పోల్చితే వచ్చే ఆర్థిక సంవత్సరంలో ఈ ఫార్మా కంపెనీల ఆదాయ వృద్ధి తక్కువగానే ఉంటుందని ఇక్రా విశ్లేషించింది. అమెరికా, ఐరోపా మార్కెట్లలో అమ్మకాలు మందగించడం, ఇతర కారణాలు ఈ పరిస్థితికి కారణమవుతాయని పేర్కొంది. 2024-25లో దేశీయ మార్కెట్లో ఔషధ రంగ వృద్ధి 6- 8 శాతానికి పరిమితం అవుతుందని అంచనా. యూఎస్‌ఎఫ్‌డీఏ నుంచి మనదేశ ఫార్మా కంపెనీలకు 'హెచ్చరిక లేఖలు' అధికంగా జారీ కావడం, ఇతర ఆంక్షలు ఇందుకు కారణమని ఇక్రా లిమిటెడ్ అసిస్టెంట్ వైస్‌ప్రెసిడెంట్ మైత్రి మాచర్ల ప్రస్తావించారు.

## కొత్త రూల్స్ వచ్చాయ్.. క్రెడిట్ కార్డు యూజర్లకు అలర్ట్

కొన్ని నియమాలు, నిబంధనల్లో మార్పులుంటాయి. ఈ క్రమంలోనే భారతదేశంలోని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ), ఐసీఐసీఐ బ్యాంక్, యాక్సిస్ బ్యాంక్ వంటి ప్రధాన క్రెడిట్ కార్డ్ జారీదారులు తమ విధానాలకు, ముఖ్యంగా రివార్డ్ పాయింట్లు, లాంజ్ యాక్సెస్ ప్రయోజనాలకు సంబంధించి గణనీయమైన మార్పులను తీసుకువస్తున్నట్లు ప్రకటించాయి. ఇతర ప్రైవేటు బ్యాంకులు కూడా మార్పులు చేసే అవకాశాలున్నాయి. కొత్త ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ 1న ప్రారంభం కానుంది. మార్చి 31తో 2023-24 ఆర్థిక సంవత్సరం ముగిసిపోతోంది. ఈ క్రమంలో బ్యాంకింగ్ రంగంలో కొన్ని మార్పులు చేటుచేసుకుంటాయి. కొన్ని నియమాలు, నిబంధనల్లో మార్పులుంటాయి. ఈ క్రమంలోనే భారతదేశంలోని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ), ఐసీఐసీఐ బ్యాంక్, యాక్సిస్ బ్యాంక్ వంటి ప్రధాన క్రెడిట్ కార్డ్ జారీదారులు తమ విధానాలకు, ముఖ్యంగా రివార్డ్ పాయింట్లు, లాంజ్ యాక్సెస్ ప్రయోజనాలకు సంబంధించి గణనీయమైన మార్పులను తీసుకువస్తున్నట్లు ప్రకటించాయి. ఇతర ప్రైవేటు బ్యాంకులు కూడా మార్పులు చేసే అవకాశాలున్నాయి.



## ఓపిక పట్టండి.. భవిష్యత్తు మనదే..

# బీఆర్ఎస్ కార్యకర్తలతో హరీశ్‌రావు



హైదరాబాద్: కష్టకాలంలో పార్టీని విడిచిపెట్టిన వాళ్లను ఎట్టిపరిస్థితుల్లోనూ తిరిగి తీసుకోమని మాజీ మంత్రి హరీశ్‌రావు స్పష్టం చేశారు. ఇది పార్టీ తీసుకున్న నిర్ణయమని.. మనకు నష్టం చేసిన వాళ్లను వదిలిపెట్టేది లేదని తెలిపారు. లెక్కలు రాస్తున్నామని.. వడ్డీతో సహా తీర్చుకుంటామని అన్నారు. భవిష్యత్తు మనదేనని.. మళ్లీ అధికారంలోకి రావడం ఖాయమని తెలిపారు. అప్పటిదాకా ఓపిక పట్టాలని సూచించారు. సిద్దిపేట జిల్లా గజ్వేల్ నియోజకవర్గ ముఖ్య కార్యకర్తలు, పార్టీ ప్రజాప్రతినిధుల సమావేశం శామీర్‌పేటలోని అరణ్య అతిథి గృహంలో జరిగింది. ఈ సమావేశంలో హరీశ్‌రావు మాట్లాడుతూ.. కే కేశవరావుకు ఏం తక్కువ చేశాం.. రాజ్యసభ పదవి ఇచ్చాం.. ఆయన కుమార్తెకు జీహెచ్ఎంసీ మేయర్ పదవి.. కుమారుడికి చైర్మన్ పదవి ఇచ్చామని గుర్తు చేశారు. అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ చేసింది ఏమీ లేదని విమర్శించారు. అన్ని ఉద్దెర పథకాలు మొదలుపెట్టి ప్రజలను మభ్యపెట్టాలని చూస్తుందని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాల వల్ల పలు సంస్థలు దివాళా తీస్తున్నాయని చెప్పారు. ఎన్నికల ముందు అమలు కాని హామీలు ఇచ్చి ఇప్పుడు ఎందుకు అమలు చేయడం లేదని సీఎం రేవంత్ రెడ్డిని హరీశ్‌రావు నిలదీశారు.


కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే రాష్ట్రంలో కరువు వచ్చిందని హరీశ్‌రావు అన్నారు. కేసీఆర్ ప్రభుత్వంలో ఎలా ఉండే.. ఇవాళ కాంగ్రెస్ ప్రభుత్వంలో ఎలా ఉందో ఒక్కసారి ప్రజలు ఆలోచన చేయాలని సూచించారు. వచ్చిపోయే కరెంటుతో మోటార్లు, ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోతున్నాయని అన్నారు. వడగండ్ల వాన వచ్చిన నష్టం జరిగితే కనీసం ఓదార్చడానికి సైతం ముఖ్యమంత్రి, మంత్రులకు తీరిక లేదని విమర్శించారు. దీన్నిబట్టే రైతులు అంటే ఈ ప్రభుత్వానికి ఎంత ప్రేమ ఉందో అర్థం చేసుకోవాలని సూచించారు. కొత్త పనులు మంజూరు చేయరు గానీ.. గతంలో మంజూరు చేసి జరుగుతున్న పనులను రద్దు చేయడం ఈ సీఎంకే చెల్లిందని హరీశ్‌రావు విమర్శించారు. సిద్దిపేట జిల్లాలో రూ.150 కోట్ల విలువైన పనులు రద్దయినట్లు తెలిపారు. ఇలాంటి వాళ్లు ఏ ముఖం పెట్టుకుని ఓట్లు అడగడానికి వస్తున్నారని మండిపడ్డారు. రద్దు చేసిన పనులపై గ్రామాల్లో చర్చపెట్టి ప్రజలు వివరించాలని అన్నారు. తమ ప్రాణం అడ్డుపెట్టి అయినా కార్యకర్తల వెంట ఉంటామని భరోసా ఇచ్చారు. భూకబ్జాలు చేసిన వారు మాత్రమే పార్టీ మారుతున్నారని హరీశ్‌రావు విమర్శించారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్న ఈ పదేండ్లలో ఎవరినీ వేధించలేదని ఆయన తెలిపారు. కేసీఆర్ రాష్ట్ర గౌరవాన్ని నిలబెట్టారని అన్నారు. 50 ఏండ్లలో జరగని అభివృద్ధిని పదేండ్లలో చేసి చూపించిన నేత కేసీఆర్ అని కొనియాడారు.

# బిజెపి అభ్యర్థినికి వంటిల్లే బెటర్!



న్యూఢిల్లీ: కర్నాటకకు చెందిన కాంగ్రెస్ ఎమ్మెల్యే షామనూరు శివశంకరప్ప బిజెపికి చెందిన మహిళా అభ్యర్థినిపై చేసిన వ్యాఖ్యలు తీవ్ర వివాదాస్పదమయ్యాయి. దావణగెరె దక్షిణ అసెంబ్లీ నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్న 92 ఏళ్ల కురువృద్ధ కాంగ్రెస్ నాయకుడు శివశంకరప్ప ఇటీవల దావణగెరె లోక్‌సభ నియోజకవర్గం నుంచి బిజెపి అభ్యర్థిగా పోటీ చేస్తున్న గాయత్రీ సిద్దేశ్వరపై చేసిన వ్యాఖ్యలు సంచలనం సృష్టించాయి. ఆయన వ్యాఖ్యలను ప్రముఖ బ్యాడ్మింటన్ క్రీడాకారిణి సైనా నెహ్వాల్ తీవ్రంగా ఖండించారు. మాజీ కేంద్ర మంత్రి జిఎం సిద్దేశ్వర భార్య అయిన గాయత్రి సిద్దేశ్వర వంట చేయడానికి మాత్రమే పనికి వస్తారంటూ శివశంకరప్ప ఇటీవల వ్యాఖ్యానించడంపై సైనా మండిపడ్డారు. పురుషాహంకారంతో నిండిన ఈ వ్యాఖ్యలు తనను ఎంతగానో బాధించాయని ఆమె ఎకక్స్ వేదికగా తెలిపారు. మహిళలు వంటింటికే పరిమితం కావాలని శివశంకరప్ప అంటున్నారని, లడకీ హూ లడ్ సక్తీ హూ అని నినాదాలు ఇచ్చే పార్టీ(కాంగ్రెస్)కి చెందిన సీనియర్ నాయకుడి నుంచి ఇటువంటి వ్యాఖ్యలు ఊహించలేదని సైనా పేర్కొన్నారు. కాగా..ఇటీవల శవశంకరప్ప మాట్లాడుతూ దావణగెరె నుంచి బిజెపి లోక్‌సభ అభ్యర్థిగా పోటీ చేస్తున్న గాయత్రరి సిద్దేశ్వరకు మాట్లాడడం కూడా సరిగ్గా రాదని, ఆమె ఇంట్లో వంట చేసుకోవడానికే పనికి వస్తారని వ్యాఖ్యానించారు. లోక్‌సభ ఎన్నికలలో ప్రజల మద్దతును కోరడానికన్నా ముందు ఆమె దావణగెరె సమస్యలను అర్థం చేసుకోవాలని ఆయన చెప్పారు.

# కేసీఆర్ జనగామ, సూర్యాపేట, నల్లగొండ జిల్లాల పర్యటన షెడ్యూల్ ఇదే..



హైదరాబాద్ : సాగునీరు అందక పంటలు ఎండిపోయి, అకాల వర్షాలతో దెబ్బతిని అల్లాడుతున్న రైతాంగానికి ధైర్యాన్ని నూరిపోసేందుకు బీఆర్ఎస్ అధినేత కే చంద్రశేఖర్‌రావు స్వయంగా రంగంలోకి దిగుతున్నారు. ఆదివారం ఆయన నేరుగా రైతుల వద్దకు వెళ్లి, మీకు మేము అండగా ఉంటామన్న భరోసా కల్పించనున్నారు. రేపు సూర్యాపేట, నల్లగొండ, జనగామ జిల్లాల్లోని పలు మండలాల్లో కేసీఆర్ పర్యటించి, ఎండిపోయిన పంట పొలాలను పరిశీలించనున్నారు.

**కేసీఆర్ పర్యటన షెడ్యూల్ ఇదే..**

ఆదివారం ఉదయం 8:30 గంటలకు కేసీఆర్ ఎర్రవెల్లి నుంచి జిల్లాల పర్యటనకు రోడ్డు మార్గంలో బయల్దేరుతారు. జనగామ జిల్లాలోని ధరావత్ తండాకు ఉదయం 10:30 గంటలకు చేరుకుంటారు. అక్కడ ఎండిపోయిన పంట పొలాలను పరిశీలించనున్నారు. 11:30 గంటలకు సూర్యాపేట జిల్లాలోని తుంగతుర్తి మండలం, అర్వపల్లి మండలం, సూర్యాపేట రూరల్ మండలాల్లో పర్యటించి, ఎండిపోయిన పంట పొలాలను పరిశీలించనున్నారు. మధ్యాహ్నం ఒంటి గంటకు సూర్యాపేట రూరల్ మండలం నుంచి బయల్దేరి.. 1:30 గంటల వరకు సూర్యాపేట నియోజకవర్గంలోని ఎమ్మెల్యే క్యాంపు ఆఫీసుకు చేరుకుంటారు. మధ్యాహ్నం 2 గంటలకు ఎమ్మెల్యే క్యాంపు ఆఫీసులోనే లంచ్ చేయనున్నారు. 3 గంటలకు ప్రెస్ కాన్ఫరెన్స్ నిర్వహించనున్నారు. మధ్యాహ్నం 3:30 గంటలకు ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీసు నుంచి నల్లగొండ జిల్లాకు బయల్దేరుతారు. సాయంత్రం 4:30 గంటలకు నిడమనూరు మండలానికి చేరుకుని ఎండిపోయిన పంటలను పరిశీలించనున్నారు. సాయంత్రం 6 గంటలకు నిడమనూరు నుంచి ఎర్రవెల్లికి బయల్దేరనున్నారు. రోడ్డు మార్గం గుండా ప్రయాణించి రాత్రి 7 గంటలకు కేసీఆర్ ఎర్రవెల్లికి చేరుకోనున్నారు.

# ఆకాశ్ క్షిపణి వీడియోను రిలీజ్ చేసిన ఇండియన్ ఆర్మీ



న్యూఢిల్లీ: ఆకాశ్ మిస్సైల్ కి సంబంధించిన వీడియోను ఇవాళ ఇండియన్ ఆర్మీ షేర్ చేసింది. టార్గెట్ ఎంగేజ్మెంట్ సామర్థ్యాన్ని ఆ మిస్సైల్ ప్రదర్శించింది. క్షిపణి వ్యవస్థ ఎలా పనిచేస్తుందో ఆ వీడియోలో చూపించారు. సముద్ర తీరం వద్ద ఆ క్షిపణిని పరీక్షించారు. తమ చూపు నుంచి ఎవరూ తప్పించుకోలేరని ఆ వీడియోలో వార్నింగ్ ఇచ్చారు. ఆకాశ్ మిస్సైల్ ప్రాణాంతకమైందని ఆ వీడియోలో పేర్కొన్నారు. హై ఆల్టిట్యూడ్‌లో చాలా కచ్చితత్వంతో టార్గెట్‌ను మిస్సైల్ ధ్వంసం చేసినట్లు వీడియోలో చూపించారు.

# కేటీఆర్ పై కేసు

**వరంగల్:** కొన్ని వారాలుగా బీఆర్ఎస్ నాయకులు న్యాయపరమైన చిక్కుల్లో పడుతున్నారు. ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో కవితను మార్చి 16న ఈడీ అరెస్టు చేసింది. పది రోజుల కస్టడీ తర్వాత తిహార్ జైలుకు తరలించింది. తర్వాత బీఆర్ఎస్ రాజ్యసభ ఎంపీ కేసీఆర్ మేనల్లుడు జోగినపల్లి సంతోష్‌రావుపైనా భూ ఆక్రమణ కేసు నమోదైంది. హైదరాబాద్‌లో అక్రమంగా భూమి కబ్జా చేసి రిజిస్ట్రేషన్ చేసుకున్నారని అందిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేశారు. తాజాగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేసీఆర్ తనయుడు కేటీఆర్‌పైనా కేసు నమోదైంది.ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కించపరిచేలా కేటీఆర్ వ్యాఖ్యలు చేశారని పీసీసీ సభ్యుడు బత్తిని శ్రీనివాస్‌రావు హనుమకొండ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈమేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్న పదేళ్లు మంత్రులు ఎక్కడికి వెళ్లినా విపక్షాలను అరెస్టు చేసేశారు. నిర్భందించేవారు. అక్రమంగా కేసులు పెట్టేవారు. ఇప్పుడు అదే పరిస్థితి రివర్స్ అయింది. ఇప్పుడు అవే కేసులను బీఆర్ఎస్ నేతలు ఎదుర్కొంటున్నారు. ఈ క్రమంలో కేటీఆర్‌పై కేసు పెట్టారు. అయితే తనపై దాఖలైన ఈ కేసుపై కేటీఆర్ ఇంకా స్పందించలేదు.ఇదిలా ఉండగా, తెలంగాణలో అధికార కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య మాటల యుద్ధం కొనసాగుతోంది. ఇదే సమయంలో బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి వలసలూ కొనసాగుతున్నాయి. రోజు రోజుకూ బీఆర్ఎస్‌ను వీడేవారి సంఖ్య పెరుగుతుండడంతో ఆ పార్టీ నేతలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ప్రెస్‌మీట్లు పెట్టి మరీ పార్టీ వీడే నేతలపై ఆరోపణలు చేస్తున్నారు. మాజీ మంత్రి హరీశ్‌రావు అయితే పార్టీ వీడేవారంతా రాజకీయ వ్యభిచారులు అని పేర్కొన్నారు. పవర్ బ్రోకర్లుగా అభివర్ణించారు. కేటీఆర్ అయితే రంజిత్‌రెడ్డి, పట్నం మహేందర్‌రెడ్డిపై విరుచుకుపడ్డారు. పార్టీ మారమని ఆస్కార్ రేంజ్‌లో నటించారని విమర్శించారు. 15 రోజులకే ప్లేటు ఫిరాయించారని ఆరోపించారు. కేసీఆర్ కూతురు జైలుకు వెళితే వారు మాత్రం ఇక ఇకలు, పకపకలతో పార్టీ మారారని మండిపడ్డారు. మళ్లీ తాము అధికారంలోకి వచ్చాక కేసీఆర్ కాళ్ల పట్టుకున్నా పార్టీలోకి తీసుకోబోమన్నారు.

## అరుణాచల్‌లో 10 మంది ఎమ్మెల్యేల ఎన్నిక ఏకగ్రీవం.. ఎవరెవరంటే..!




అరుణాచల్‌ప్రదేశ్‌లో అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ జరుగక ముందే 10 ఎమ్మెల్యేలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అరుణాచల్‌లో అసెంబ్లీ ఎన్నికల నామినేషన్‌ల ఉపసంహరణ గడువు ఇవాల్టితో ముగిసింది. నామినేషన్‌ల గడువు ముగిసిన అనంతరం రాష్ట్రంలోని మొత్తం 60 స్థానాలకుగాను 10 స్థానాల్లో కేవలం ఒక్కొక్క నామినేషన్ మాత్రమే ఉన్నాయి. ఆ పది మందిలో అందరూ బీజేపీ అభ్యర్థులే ఉన్నారు. దాంతో ఆయా నియోజకవర్గాల్లో వారు ఎమ్మెల్యేలుగా ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు అధికారులు ప్రకటించారు. ఇలా ఏకగ్రీవంగా ఎన్నికైన ఎమ్మెల్యేల్లో అరుణాచల్‌ప్రదేశ్ ముఖ్యమంత్రి పెమా ఖండూ, ఉప ముఖ్యమంత్రి చౌనా మెయిన్ కూడా ఉన్నారు. సీఎం ఖండూ ముక్తో అసెంబ్లీ స్థానం నుంచి, డిప్యూటీ సీఎం చౌనా మెయిన్ చౌఖామ్ అసెంబ్లీ స్థానం నుంచి నామినేషన్‌లు వేశారు. ఇక ఏకగ్రీవంగా ఎన్నికైన మిగతా 8 మందిలో సగలీ అసెంబ్లీ స్థానం నుంచి రతు టెకీ, తాలీ నుంచి జిక్కీ టకో, తలిహా నుంచి న్యాటో దుకమ్, రోయింగ్ నుంచి ముట్చు మితి, జిరో హపోలీ నుంచి హేగ్ అప్పా, ఇటానగర్ నుంచి టెకీ కసో, బొండిలా నుంచి డోంగ్రు సియోంగియూ, హయులియాంగ్ నుంచి దసంగ్లూ పుల్ ఉన్నారు. అరుణాచల్‌ప్రదేశ్‌లో తొలి విడత లోక్‌సభ ఎన్నికలతోపాటే ఏప్రిల్ 19న అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ జరుగనుంది.

# ఎల్జేపీ లోక్‌సభ అభ్యర్థుల జాబితా విడుదల.. హాజీపూర్ నుంచి బరిలో చిరాగ్




ఎన్డీఏ కూటమిలో భాగస్వామిగా ఉన్న లోక్‌జన శక్తి పార్టీ రాంవిలాస్ పాశ్వాన్ వర్గం వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో తమ పార్టీ తరఫున బరిలో దిగనున్న అభ్యర్థుల జాబితాను ప్రకటించింది. పొత్తులో భాగంగా ఎల్జేపీకి ఐదు లోక్‌సభ స్థానాలు దక్కాయి. ఆ ఐదు స్థానాలకు ఎల్జేపీ రాంవిలాస్ పాశ్వాన్ వర్గం చీఫ్ చిరాగ్ పాశ్వాన్ అభ్యర్థులను ఖరారు చేశారు. చిరాగ్ పాశ్వాన్ తన సిట్టింగ్ స్థానమైన హాజీపూర్ నుంచి బరిలో దిగనున్నారు. అదేవిధంగా అరుణ్ బార్తి ఎస్సీ రిజర్వ్‌డ్ లోక్‌సభ స్థానమైన జాముయ్ నుంచి, రాజేశ్ వర్మ ఖగారియా లోక్‌సభ స్థానం నుంచి, శాంభవి చౌధరి మరో ఎస్సీ రిజర్వ్‌డ్ లోక్‌సభ స్థానం సమస్తిపూర్ నుంచి, వీణాదేవి వైశాలి లోక్‌సభ స్థానం నుంచి పోటీ పడనున్నారు. ఎన్డీఏ కూటమితో పొత్తులో భాగంగా బీహార్‌లో ఎల్జేపీకి ఐదు లోక్‌సభ స్థానాలు దక్కాయి. గత లోక్‌సభ ఎన్నికల్లో కూడా ఎల్జేపీ ఐదు లోక్‌సభ స్థానాల్లో విజయం సాధించింది. అయితే చిరాగ్ పాశ్వాన్ చిన్నాన్న పశుపతి పరాస్ పార్టీని చీల్చి ఎన్డీఏతో జట్టు కట్టడంతో చిరాగ్ ఒక్కరే పార్టీ తరఫున ఎంపీగా మిగిలారు. ఈ క్రమంలో ఈసారి పశుపతి పరాస్‌ను పక్కన పెట్టిన బీజేపీ.. ఎల్జీపీకి ఐదు సీట్లు ఇచ్చింది.

# పరారీలో లేడీ డాన్.. భర్త అంత్యక్రియలకు హాజరుకాని అఫ్సా అన్సారీ



చండీఘడ్: యూపీలో ఇవాళ ముక్తార్ అన్సారీ భౌతికకాయానికి అంత్యక్రియలు నిర్వహించారు. ఘాజిపూర్‌లోని తన పూర్వీకుల శ్మశానవాటికలోనే అన్సారీకి తుది వీడ్కోలు పలికారు. అయితే పరారీలో ఉన్న ముక్తార్ అన్సారీ భార్య, లేడీ డాన్ అఫ్సా అన్సారీ కోసం పోలీసులు ఆ సమయంలో ఎదురుచూశారు. యూపీ పోలీసుల లేడీ డాన్ లిస్టులో అఫ్సా అన్సారీ ఉన్నది. అయితే శశ్మానవాటిక వద్దకు ఆమె రాలేదు. కాలీ బాగ్ శ్మశానవాటికలో ముక్తార్ అన్సారీ మృతదేహాన్ని ఖననం చేశారు. తల్లి సమాధి పక్కనే అతన్ని పూడ్చారు. భారీ సంఖ్యలో శ్మశానవాటికకు ప్రజలు చేరుకున్నారు. అన్సారీ సోదరుడు, కుమారుడు అంత్యక్రియల్లో పాల్గొన్నారు. పలు కేసుల్లో అఫ్సా వాంటెడ్‌లో ఉన్నది. గ్యాంగ్‌స్టర్ యాక్టు కింద కూడా ఆమెపై కేసులు ఉన్నాయి. దాదాపు ఏడాది నుంచి ఆమె పరారీలో ఉన్నది. గృహిణిగా చెప్పుకునే ఆమెపై మూడు కీలకమైన కేసులు ఉన్నాయి. దాంట్లో రెండు భూకబ్జా కేసులు కూడా ఉన్నట్లు పోలీసులు చెబుతున్నారు. 2022, జనవరి 31వ తేదీన గ్యాంగ్‌స్టర్ చట్టం కింద దక్షిణ్ తోలా పోలీసు స్టేషన్‌లో ఆమెపై కేసు నమోదు అయ్యింది. గ్యాంగ్‌స్టర్ నుంచి పొలిటీషియన్‌గా మారి, ఏకంగా ఐదు పర్యాయాలు ఎమ్మెల్యేగా పనిచేసి, గురువారం రాత్రి గుండెపోటుతో ముఖ్తార్ అన్సారీ మరణించాడు. ఇవాళ ఆయన భౌతికకాయానికి అంత్యక్రియలు ప్రశాంతంగా ముగిశాయి.

# కాంగ్రెస్‌లో చేరిన బీజేపీ నాయకురాలు తేజస్విని గౌడ



న్యూఢిల్లీ: కర్ణాటకకు చెందిన బీజేపీ నాయకురాలు తేజస్విని గౌడ కాంగ్రెస్ పార్టీలో చేరారు. నెల కిందట ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేసిన ఆమె తిరిగి సొంతగూటికి చేరుకున్నారు. శనివారం ఢిల్లీలోని కాంగ్రెస్ ప్రధాన కార్యాలయంలో పార్టీ ప్రధాన కార్యదర్శి జైరాం రమేష్, మీడియా, ప్రచార విభాగం అధినేత పవన్ ఖేరా సమక్షంలో ఆ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా బీజేపీపై తేజస్విని గౌడ మండిపడ్డారు. రాజ్యాంగం, ప్రజాస్వామ్య విలువలపై ఆ పార్టీకి నమ్మకం లేదని ఆరోపించారు. కాంగ్రెస్ మాటల్లో కాకుండా చేతలను నమ్ముతుందని అన్నారు. చరిత్ర ఉన్న కాంగ్రెస్‌లోకి తిరిగి వచ్చిన తాను పూర్తి చిత్తశుద్ధితో పార్టీ కోసం పని చేస్తానని అన్నారు. కాగా, మాజీ జర్నలిస్ట్ అయిన తేజస్విని గౌడ 2004 నుంచి 2009 వరకు కాంగ్రెస్ ఎంపీగా ఉన్నారు.

Printed, Published and owned by **VISHWANATH V**, Printed at S A Printers D No 3 92 Shed No 2, Sy No 45 and 49, Sadashiv Nagar Narapally Village, Ghatkesar Mandal, Medchal - Malkajgiri District, Telangana - 501301.
and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State.
Editor : **VISHWANATH V**, **RNI Regd. No. TELTEL/2023/86207**, Phone No. 8977598262, Email Id : reportervishwanath@gmail.com